ప్రతిపక్షం

www.prathipaksham.in

ఆదివారం 02.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 222 పేజీలు:10+4 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu

తుది పోరుకు సిద్ధమైన భారత మహిళల జట్టు 10

ఈ ఎన్నిక రానున్న స్థానిక సంస్థలు, ఆ తర్వాత జరిగే జీహెచ్ఎంసీ ఎన్నికలలోనూ తీవ్ర ప్రభావం చూపుతుందని, అందుకే జూబ్లీహిల్స్ బైపోల్ గెలిచి తీరాలన్న పట్టుదలతో బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా ముందుకు కదులుతోంది. ప్రచారంలో భాగంగా స్థానికంగా కొందరు నేతలు టిఫిన్ సెంటర్లలో దోసెలు వేయడం, అరటి పళ్లు అమ్మడం, హెయిర్ సెలూన్ లో కటింగ్ చేయడం వంటి పనులపై కేసీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారట. ప్రచారంలో ఇలాంటి స్కిట్స్ చేస్తే కామెడీగా కాసేపు నవ్వుకోవడానికి ఉంటుందే తప్ప ఓటర్లను ఏ మాత్రం ఆకట్టుకోలేమని కేసీఆర్ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ఇలాంటి సరదా స్కిట్స్ ను ఓ మాజీ మంత్రి మొదలుపెట్టారు.

ఏమిటీ కామెడీ స్కిట్స్!!

ఇలాగేనా ఉప ఎన్నిక ప్రచారం?.. దోసెలు, బజ్జీలు వేయడమేనా పని!

- నవ్వుకోవడాని తప్ప దేనికి పనికొస్తాయి?
- ఓ మాజీ మంత్రి తీరుపై కేసీఆర్ తీవ్ర అసహనం
- నవ్వులాటకు సమయం కాదని గమనించండి
- ఉప ఎన్నిక ప్రభావం వచ్చే ఎన్నికలపై ఉంటుంది
- మన పాలనలో ఏం చేశామో చెప్పండి
- కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించండి
- సీరియస్ గా తిరుగుతూ ఓటర్లను కలవండి
- నగరంలో, తెలంగాణలో పార్టీదే బలమని తేలాలి
- పార్టీ నేతలకు బీఆర్ఎస్ అధినేత హితోపదేశం
- ప్రచార బాధ్యతలు చూస్తున్న కేటీఆర్, హరీశ్
- నేరుగా పర్యవేక్షిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 1: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ నేతల ప్రచార తీరుపై గులాబీ బాస్ అసహనం వ్యక్తం చేస్తూ నేతలకు తలంటారు. ప్రచారంలో భాగంగా పార్టీ నేతలు దోసెలు వేయడం, కూరగాయలు అమ్మడం, బట్టలు ఇస్త్రీ చేయడం లాంటి స్కిట్స్ చెయ్యడమేంటని ఆయన తీవ్రంగా మండిపడినట్టు సమాచారం. ఎన్నికల ప్రచారం అంటే సరదా కాదని, కాస్త సీరియస్ క్యాంపెయిన్ చేయాలని హితవు పలికారు. కామెడీ ప్రచారాన్ని ఆపి, బీఆర్ఎస్ హయాంలో ఏం చేశామో, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ఏమిటో ఓటర్లకు వివరించాలని సూచించారని తెలిసింది. అయితే ఇదంతా ఓ మాజీ మంత్రిని ఉద్దేశించి చెప్పినా, కొంతమంది ఆయనను ఫాలో అవుతున్నారన్న ఉద్దేశంతోనే కేసీఆర్ నేతలకు క్లాస్ తీసుకున్నారన్న చర్చ జరుగుతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. సిట్టింగ్ సీటును తిరిగి కైవసం చేసుకునేందుకు ఏ అవకాశాన్ని వదులుకోకుండా దూసుకెళ్తోంది. ఉప ఎన్నికకు సంబంధించి ప్రతి అంశాన్ని కేటీఆర్, హరీశ్ పర్యవేక్షిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం జరుగుతున్న తీరును ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న

..:: మిగతా 2లో

వెంకన్న గుడిలో తొక్కిసలాట

9 మంది భక్తుల దుర్మరణం

20 మందికి పైగా తీవ్ర గాయాలు

- అందులో ముగ్గురి పరిస్థితి విషమం
- శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో దుర్ఘటన
- ఏకాదశి కావడంతో భారీగా వచ్చిన భక్తులు
- కట్టడి చేయడంలో నిర్వాహకులు విఫలం
- రద్దీని తట్టుకోలేక పడిపోయిన బారికేడ్లు
- దీంతో అకస్మాత్తుగా తోపులాట
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్
- సంతాపం తెలిపిన ప్రధాని మోడీ, ఏపీ సీఎం చంద్రబాబు

ప్రతిపక్షం ప్రతినిధి, శ్రీకాకుళం

నవంబర్ 1: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం తొక్కిసలాట జరిగింది. దీంతో తొమ్మిది మంది భక్తులు మృతిచెందారు. కొందరు స్పృహ తప్పి పడిపోయారు. చాలా మందికి గాయాలయ్యాయి. వారందరికి సపర్యలు చేసి వెంటనే ఆస్పత్రులకు తరలించారు. ఏకాదశి సందర్భంగా

..:: మిగతా 2లో

'జూబ్లీ' ప్రచారానికి చంద్రబాబు, పవన్?!

- సెటిలర్లు, కమ్మ ఓటర్లను ప్రభావితం చేసేందుకు
- సినీరంగం ఓట్లు 30 వేలు, కమ్మ ఓటర్లు 25 వేలు
- ఇప్పటికే ఆ ఇద్దరు నేతలకు బీజేపీ ఆహ్వానం
- అయితే, ఇంకా నిర్ధారణ కాని కీలక నేతల షెడ్యూల్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 1: జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారం ఊపందుకుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఇప్పటికే ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. నవీన్ యాదవ్ విజయం కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం చేస్తున్నారు. మంత్రులు గల్లీగల్లీ తిరుగుతున్నారు. ఇటు మాగంటి సునీత గెలుపు బాధ్యతలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన భుజస్కంధాలపై వేసుకొని ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఇక ఈ ప్రచారపర్వంలోకి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు,

..:: మిగతా 2లో

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

- ఐటీ, ఫార్మా, ఎయిర్‌స్పేస్, డిఫెన్స్ లో చాన్స్
- కెనడా హైకమిషనర్ తో సీఎం రేవంత్
- సీఎంతో ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్ భేటీ
- హైదరాబాద్‌లో ఫ్రెంచ్ బ్యూరో ఏర్పాటుకు సీఎం వినతి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 1 : తెలంగాణ లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కెనడా ప్రతినిధులను కోరారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో సీఎంతో కెనడా హైకమిషనర్ క్రిస్టోఫర్ కూటర్ బృందం సభ్యులు సమావేశం అయ్యారు. ఐటీ, ఫార్మా, ఎయిర్ స్పేస్, డిఫెన్స్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కెనడాతో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంపై చర్చించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను కెనడా హైకమిషనర్‌కు సీఎం రేవంత్ వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. స్టార్టప్స్, ఎడ్యుకేషన్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్‌లోనూ పెట్టుబడుల పెట్టడానికి తగు అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో కెనడా మినిస్టర్ ఎడ్ జాగర్ , ట్రేడ్ కమిషనర్ విక్రమ్ జైన్, కారెన్, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రితో ఫ్రాన్స్ కాన్సులెట్ జనరల్ మార్క్ లామీ బృందం మర్యాదపూర్వకంగా సమావేశం అయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్‌లో ఫ్రాన్స్ ఆన్ గోయింగ్ ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిపై చర్చించారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని వారిని సీఎం కోరారు. హైదరాబాద్‌లో ఫ్రెంచ్ బ్యూరో కార్యాలయాన్ని మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మౌద్ మిక్వా, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అఖండ విజయం ఖాయం

- కాంగ్రెస్ నేతలు అబద్ధాలు చెబుతున్నారు
- మంత్రులు గల్లీ గల్లీ తిరుగుతున్నారు
- రెండేండ్ల పాలనలో చేసిందేమీ లేదు
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

చిటుకుల మైసారెడ్డి, ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 1: జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ అఖండ విజయం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా శనివారం ఆయన రెహమత్‌నగర్‌లో భారీ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత ఎన్నికలలో గోపినాథ్‌కు ఈ డివిజన్ నుంచే ఆరు వేల మెజార్టీ వచ్చినదని, ఈసారి 12 వేల మెజార్టీతో విజయం సాధిస్తామనే నమ్మకం ఉందని తెలిపారు. 'హైదరాబాద్‌లో ఒక్క సీటు కూడా కాంగ్రెస్ గెలవలేదు. గోపినాథ్ ఈ ప్రాంతంలో కోట్ల రూపాయల విలువైన భూమిని కాపాడారు, నీటి సమస్యను పరిష్కరించారని' చెప్పారు. సునీత తన భర్త గోపినాథ్‌ను గుర్తుచేసుకుంటే దాన్నీ కాంగ్రెస్ నేతలు డ్రామా అంటారని విమర్శించారు. ఏడుపుని కూడా రాజకీయంగా ఉపయోగించుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఒక్క సీటు

..:: మిగతా 2లో

నేను వాళ్ల, వీళ్ల బాణం కాదు తెలంగాణ ప్రజల బాణాన్ని

- విద్య, వైద్య రంగాల పతనం
- మహిళలు, బీసీల ప్రాతినిధ్యం పెరగాలి
- సామాజిక తెలంగాణ కోసం పోరాటం
- మీడియాతో జాగృతి అధినేత కవిత

ప్రతిపక్షం బ్యూరో కరీంనగర్

నవంబర్ 1: రాష్ట్రంలో రాజకీయ శూన్యత నెలకొంది. ప్రజల తరఫున పోరాడాల్సిన పార్టీలు ఆ బాధ్యత నిర్వర్తించడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. కరీంనగర్‌లో శనివారం జరిగి జాగృతి 'జనం బాట' అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 'నేను వాళ్ల, వీళ్ల బాణం కాదు, తెలంగాణ ప్రజల బాణాన్ని' అని స్పష్టం చేశారు. జనం బాట పూర్తయిన తర్వాత తమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. తమ ప్రాధాన్యం ప్రజల సమస్యల పరిష్కారం అని పేర్కొన్నారు. కొన్ని పార్టీలను నమ్ముకొని దగాపడ్డామని ప్రజలు చెబుతున్నారన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో ప్రధాన పార్టీలు మునిగిపోయి, రైతులు, కార్మికుల

..:: మిగతా 2లో

అక్టోబర్‌లో రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు

జీఎస్టీ వసూళ్లు ;అక్టోబర్ మాసంలో రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. దాదాపు రూ.1.95 లక్షల కోట్లు వసూలయ్యాయి. నిరుడు ఇదే నెలతో పోలిస్తే 4.6 శాతం పెరిగాయి. అపుడు జీఎస్టీ వసూళ్లు రూ.1.87 లక్షలుగా ఉన్నాయి.

9

వేడెక్కిన బిహార్ ఎన్నికల రణరంగం

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్ రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు ప్రచారంలో మరింత వేగాన్ని పెంచాయి. ఓటర్లను ఆకర్షించడానికి.. వారి మనసు దోచుకోవడానికి హామీల వర్షం కురిపిస్తున్నాయి.

9

ఇక నుంచి బ్యాంకులో నలుగురు నామినీలు

బ్యాంకు ఖాతాదారులకు అలెర్ట్. బ్యాంకు నిబంధనలలో కీలక మార్పులు జరుగబోతున్నాయి. మారిన నిబంధనలు నవంబర్ ఒకటి నుంచి అమలులోకి వచ్చాయి.

9

రేర్ ఎలిమెంట్స్ అన్వేషణలో భారత్

ప్రస్తుతం ప్రపంచంలో ఏం నడుస్తుందంటే, ఒకవైపు అమెరికా టారిఫ్‌లు, ఇంకోవైపు, రేర్ ఎర్త్ మినరల్స్ కోసం ప్రపంచ దేశాల మధ్య పోటీ. ఎందుకంటే వీటి అవసరం అన్ని దేశాలకు ఉంది. కానీ, ఇవి దొరకడం అరుదు.

9

రాజకీయం

దేశానికి పేరు తెస్తే ఇలాగేనా మాట్లాడేది!

- కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి అజార్ సీరియస్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 1: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలను మంత్రి అజారుద్దీన్ తీవ్రస్థాయిలో ఆక్షేపించారు. శనివారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో అజార్ మాట్లాడుతూ కిషన్ రెడ్డికి క్రికెట్ గురించి ఏం తెలుసని ప్రశ్నించారు. బ్యాట్ పట్టుకోవడం కూడా రాదంటూ ఎద్దేవా చేశారు. తనను విమర్శించే వాళ్లకి సమాధానం చెప్పి తన స్థాయి తగ్గించుకోలేనన్నారు. తనపై వచ్చిన ఆరోపణలకు కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందని గుర్తుచేశారు. దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన తాను దేశ ద్రోహినా! అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసమే బీజేపీ తనను టార్గెట్ చేసిందని ఆరోపించారు. మంత్రిగా జూబ్లీహిల్స్‌లో అడుగుపెట్టిన తనను ప్రజలు ఆదరించారని అన్నారు. విమర్శించినవాళ్లకు సమాధానం చెప్పదల్చుకోలేదని మంత్రి అజారుద్దీన్ స్పష్టం చేశారు. అజారుద్దీన్‌పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అజారుద్దీన్ దేశ ద్రోహానికి పాల్పడ్డారని, భారత్‌కు చెడ్డపేరు తెచ్చారని విమర్శించారు. ఆయనపై అనేక కేసులు ఉన్నాయని, అలాంటి వ్యక్తికి కాంగ్రెస్ మంత్రి పదవి ఇవ్వడం ప్రజాస్వామ్యానికి అవమానకరమన్నారు. అజారుద్దీన్ దేశ గౌరవానికి భంగం కలిగించారంటూ కిషన్ రెడ్డి చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి.

ఏమిటీ కామెడీ స్కిట్స్!!

మొదటిపేజీ తరువాయి

అధినేత కేసీఆర్ పార్టీ నేతలకు తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు తెలంగాణలో గులాబీ పార్టీ బలంగా ఉందన్న సంకేతాలు పంపాలని కేసీఆర్ భావిస్తున్నారు.

జీహెచ్ఎంసీ ఎన్నికలలోనూ తీవ్ర ప్రభావం

ఈ ఎన్నిక రానున్న స్థానిక సంస్థలు, ఆ తర్వాత జరిగే జీహెచ్ఎంసీ ఎన్నికలలోనూ తీవ్ర ప్రభావం చూపుతుందని, అందుకే జూబ్లీహిల్స్ బైపోల్ గెలిచి తీరాలన్న పట్టుదలతో బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా ముందుకు కదులుతోంది. ప్రచారంలో భాగంగా స్థానికంగా కొందరు నేతలు టిఫిన్ సెంటర్లలో దోసెలు వేయడం, అరటి పళ్లు అమ్మడం, హెయిర్ సెలూన్ లో కటింగ్ చేయడం వంటి పనులపై కేసీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారట. ప్రచారంలో ఇలాంటి స్కిట్స్ చేస్తే కామెడీగా కాసేపు నవ్వుకోవడానికి ఉంటుందే తప్ప ఓటర్లను ఏ మాత్రం ఆకట్టుకోలేమని కేసీఆర్ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ఇలాంటి సరదా స్కిట్స్ ను ఓ మాజీ మంత్రి మొదలుపెట్టారు. నేరుగా ఆయన పేరు ప్రస్తావించకుండా ఎన్నికల ప్రచారంలో ఇలాంటి సరదా స్కిట్స్ మానేయ్యాలని చెప్పారట. ఎన్నికల ప్రచారంలో ఇలాంటి కామెడీ పనులు చేస్తే సోషల్ మీడియాలో ప్రచారానికి పనికి వస్తాయే గానీ, ఓటర్లను ఏ మాత్రం ఆకట్టుకోవని కేసీఆర్ అభిప్రాయపడినట్లు చెబుతున్నారు. ప్రధానంగా పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కేసీఆర్ సూచించారు. అందులోనూ హైదరాబాద్ అభివృద్ధిని జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా ప్రస్తావించాలని చెప్పినట్లు తెలుస్తోంది. కేసీఆర్ హితోపదేశంతోనైనా బీఆర్ఎస్ నేతలు ఎన్నికల ప్రచారాన్ని సీరియస్‌గా తీసుకుంటారో లేదో వేచిచూడాల్సిందే మరి.

'అహనా పెళ్లంట' సినిమాలా బీఆర్ఎస్ తీరు

- కేటీఆర్ పై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ ఫైర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 1: బీఆర్ఎస్ నేతల తీరు చూస్తే 'అహనా పెళ్ళంట' సినిమాలాగ ఉందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ తదితరులతో కలిసి ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. సినిమాలో మాదిరి కోడిని వేలాడదీసి ఆశ చూపినట్లు నిరుద్యోగులకు కేటీఆర్ ఉద్యోగాల ఆశ చూపారంటూ మండిపడ్డారు. కేబినెట్‌లో ఐదేళ్లు మహిళా మంత్రి లేకుండా ప్రభుత్వం నడిపిన నీచ చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని దుయ్యబట్టారు. ఉప ఎన్నికలో బీఆర్ఎస్ కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనన్నారు. బీఆర్ఎస్ తో లోపాయికారి ఒప్పందంలో భాగంగానే జూబ్లీహిల్స్ లో బీజేపీ ప్రాధాన్యత లేని అభ్యర్థిని నిలబెట్టిందని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రతి నిర్ణయంలో కేసీఆర్ పాత్ర ఉందని తెలిపారు. రాష్ట్రపతి పదవి మొదలుకొని ట్రిపుల్ తలాక్ వరకు కేసీఆర్ బీజేపీకి మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. డబ్బుతో ఓట్లను కొనాలన్నది అనైతిక చర్య అని ఆరోపించారు. 'మీరు ఐదు వేలు తీసుకోండి బీఆర్ఎస్ కి ఓటేయండి? ఓటర్లను ప్రలోభపెడుతున్నారని ఆరోపించారు. కేటీఆర్ మాట ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే విధంగా ఉందని దుయ్యబట్టారు. ఎలక్షన్ కమిషన్ తక్షణమే కేటీఆర్ పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

వెంకన్న గుడిలో తొక్కిసలాట

మొదటిపేజీ తరువాయి

ఆలయానికి భక్తులు భారీగా వచ్చారు. వారిని కట్టడి చేయలేకపోవడంతో తోపులాట, తొక్కిసలాట జరిగిందని సమాచారం. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు స్పందించారు. బాధితులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని మంత్రి లోకేశ్ చెప్పారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ. మూడు లక్షలు ఇస్తామన్నారు. గుడి వద్ద జరిగిన ఘటన బాధాకరమన్నారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని శ్రీకాకుళం ఆస్పత్రికి పంపించామని చెప్పారు. 94 యేండ్ల పెద్దాయన ఒకరు ఈ గుడి కట్టించారని, ఉదయం 11.30 గంటల ప్రాంతంలో తొక్కిసలాట జరిగిందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. వెంటనే సహాయ చర్యలు చేపట్టామన్నారు. భవిష్యత్తులో ఇలాంటిఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గాయపడిన వారు పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

వారికి ప్రాణాపాయం లేదు

ఇంతమంది భక్తులు వస్తారని నిర్వాహకులు ఊహించలేదని, గుడికి ఒకే మార్గం ఉండటంతో తోపులాట జరిగిందని లోకేశ్ వివరించారు. బారికేడ్లు ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి, ఎమ్మెల్యే, అటు అధికారులను అప్రమత్తం చేశామని చెప్పారు. తొక్కిసలాట ఘటనపై ఆలయ నిర్వాహకులు, సిబ్బందిని విచారణ జరుపుతామన్నారు. పలాస ఆస్పత్రిలో ఉన్న 16 మందికి ఎలాంటి ప్రాణాపాయం లేదని మంత్రి లోకేశ్ చెప్పారు. తీవ్రగాయాలైనవారికి మెరుగైన చికిత్స అందిస్తామన్నారు. మృతుల కుటుంబాలకు మట్టి ఖర్చుల కింద రూ.10 వేలు అందించామన్నారు. కాగా, తొక్కిసలాట ఘటనపై ఏపీ ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఈ గుడికి 15 వేల మంది భక్తులు వచ్చారని అధికారులు వెల్లడించారు. ఘటనాస్థలంలో ఏడుగురు, పలాస ఆస్పత్రిలో ఇద్దరు మృతి చెందారన్నారు. పలాసలో చికిత్సపొందుతున్న వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు.

ప్రాణనష్టం జరగడం చాలా బాధాకరం

శ్రీకాకుళం ఘటనపై ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తీవ్ర విచారం వ్యక్తం చేసారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తొక్కిసలాట ఘటనలో ప్రాణనష్టం జరగడం చాలా బాధాకరమని అన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానన్నారు. ఈ విషాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ఇస్తామని ప్రకటించారు. గాయాల పాలైన వారికి రూ.50 వేలు చొప్పున పరిహారం ఇస్తామని చెప్పారు. భక్తుల మరణం అత్యంత విషాదకరమని, తొక్కిసలాట తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తొక్కిసలాట ఘటనపై తెలంగాణ దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ దిగ్భ్రాంతి చెందారు. భక్తులు మృతిచెందడం అత్యంత బాధాకరమన్నారు. రాష్ట్రంలోని ఆలయాలలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దేవాదాయ కమిషనర్‌ను ఆదేశించారు. ఏకాదశి, కార్తిక దీపోత్సవ క్యూలైన్లు, కనీస వసతులపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాగా, కాశీబుగ్గ దుర్ఘటనపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భక్తులు మృత్యువాత పడడం బాధాకరమన్నారు.

కేటీఆర్‌పై సుమోటోగా కేసు పెట్టాలి

- బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 1: 'ఓటుకి రూ. ఐదు వేలు అడుక్కోండి' అన్న కేటీఆర్ వ్యాఖ్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆక్షేపించారు. పది సంవత్సరాల పాలనలో అక్రమంగా సంపాదించిన డబ్బుతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటర్లను కొనుగోలు చేసేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని అన్నారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఎన్నికల కమిషన్ సుమోటోగా తీసుకుని కేటీఆర్ పై కేసు పెట్టాలని కోరారు. హుజూరాబాద్ ఉప ఎన్నికలో ఓటుకు ఆరు వేలు ఇచ్చిన సంస్కృతి వారిదనీ, అయినా ప్రజల చేతులలో ఓడిపోయిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ప్రజల అభిమానంతో మరింత అభివృద్ధి చేస్తామని విశ్వాసం కలిగిస్తూ ఉప ఎన్నికలో ఓట్లు అడుగుతున్నామన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచన కలిగినవారని, కంటోన్మెంట్ ఉప ఎన్నికలో మాదిరి కాంగ్రెస్ కి ఓటు వేసి గెలుపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. తమ అభ్యర్థి చదువుకున్న వ్యక్తి అని, పని చేయగలిగే శక్తి ఉన్న నవీన్ యాదవ్ ను ఓటర్లు ఆశీర్వదిస్తున్నారన్నారు. ఇది చూసి ఓర్వలేక ఓటర్లను మభ్యపెట్టేందుకు బీఆర్ఎస్ నక్కజిత్తుల ఎత్తుగడలు వేస్తున్నదని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎన్ని నక్కజిత్తుల ఎత్తుగడలు వేసినా, ఓటర్లను మభ్యపెట్టినా ప్రజలు కాంగ్రెస్ కు పట్టం గట్టాలని నిర్ణయించారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌కుమ్మక్కై బీజేపీ మూడంకెలు దాటని వ్యక్తిని అభ్యర్థిగా పెట్టిందని ఆరోపించారు.

'జూబ్లీ' ప్రచారానికి చంద్రబాబు, పవన్?!

మొదటిపేజీ తరువాయి

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం అడుగుపెట్టనున్నట్లు సమాచారం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీకి టీడీపీ, జనసేన మద్దతు ఇచ్చాయి. దీంతో ఇక్కడ ప్రచారం నిర్వహించేందుకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ను తెలంగాణ బీజేపీ అగ్రనాయకత్వం ఆహ్వానించినట్లు తెలిసింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సెటిలర్ల ఓట్లు కీలకంగా ఉన్నాయి. ముఖ్యంగా సినీ పరిశ్రమకు చెందినవారు గణనీయంగా ఉన్నారు. మూడు లక్షల మందిలో సీమాంధ్ర ఓటర్లు లక్షన్నరకు పైగానే ఉన్నారని, కాపు సామాజిక వర్గానికి చెందినవారు, ముస్లింలు తరువాత అత్యధికంగా ఉన్నారని బీజేపీ అంచనా వేసింది. సినీరంగం ఓట్లు 30 వేలు, కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు 25 వేల మందికిపైగా ఉన్నారు. వారి ఓట్లను ఆకట్టుకోవాలంటే చంద్రబాబు, పవన్ ఇద్దరు అగ్రనేతలు ప్రచారం చేస్తే మేలని ఆ పార్టీ నేతలు ధీమాతో ఉన్నారు. కేవలం ఒక నియోజకవర్గంలో ఎన్నిక కోసం చంద్రబాబు, పవన్ ప్రచారానికి వస్తారా! అన్న వాదన కూడా ఉంది. ఒకవేళ ఆ ఇద్దరూ జూబ్లీహిల్స్ ప్రచార పర్వంలోకి అడుగుపెడితే బీజేపీ బలం అనూహ్యంగా పెరుగుతుందని భావిస్తున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ రోడ్ షోలు, కార్నర్ మీటింగులు నిర్వహిస్తే పార్టీలో జోష్ వస్తుందని, తద్వారా కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు గట్టి పోటీ ఇవ్వవచ్చుననే భావనలో బీజేపీ నేతలు ఉన్నారు.

నేను వాళ్ల, వీళ్ల బాణం కాదు తెలంగాణ ప్రజల బాణాన్ని

మొదటిపేజీ తరువాయి

సమస్యలపై ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. రైతులు మొంథా తుపానుతో నష్టపోయినా స్పందన లేదన్నారు. రెండు పక్షాలు ప్రజల కోసం తిరగడం లేదని, వాళ్ల తరఫున తాము పోరాటం చేస్తామని చెప్పారు. కార్మికుల హక్కుల కోసం పోరాటం అవసరమని, మోడీ కార్మికుల హక్కులను కాలరాస్తున్నా కాంగ్రెస్, బీఆర్ఎస్ పోరాడలేదన్నారు. రైతు చట్టాలపై రాహుల్ గాంధీ మాట్లాడినా లేబర్ చట్టాలపై స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ, సింగరేణి కార్మికులు నష్టపోతున్నారని, వారికి మద్దతుగా ఉద్యమం అవసరమని అన్నారు.

విద్య, వైద్య రంగాల పతనం

'స్వరాష్ట్రం తెచ్చుకొని 12 యేండ్లు అయినా మార్పు లేదు. విద్య, వైద్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్ లభించకపోవడం ప్రజల ప్రధాన వేదన' అని కవిత పేర్కొన్నారు. మండలిలో తాను మాట్లాడిన తర్వాతే సీఎం 700 కోట్లు విడుదల చేశారని, ఇంకా నిధులు నిలిచిపోయాయని విమర్శించారు. మహిళలు 50 శాతం ఉన్నా అధికారంలో వారి ప్రాతినిధ్యం తక్కువేనన్నారు. బీసీలకు సరైన రిజర్వేషన్ ఇవ్వాలని సామాజిక తెలంగాణ సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 'గతంలో బంధనలు ఉండేవి. ఇప్పుడు నేను ఫ్రీ బర్డ్‌ను. గ్రానైట్ మాఫియా పర్యావరణాన్ని పాడు చేస్తోంది. ఇక మౌనం కాదు, పోరాటం చేస్తాం' అని హెచ్చరించారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ఆలస్యం, ఐటీ టవర్ నుంచి కంపెనీల పారిపోవడంపై కవిత గారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సిల్వర్ ఫిలిగ్రీ కళాకారులతో కవిత సమావేశమయ్యారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కళను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని, తన వంతు సహాయం చేస్తానన్నారు. ప్రభుత్వంపై కూడా ఒత్తిడి తెస్తామన్నారు. ఈ కార్యక్రమం లో నాయకులు ఎల్ రూప్ సింగ్, జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భారత ఆర్మీ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారు

- కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఆగ్రహం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 1: కాంగ్రెస్ పార్టీపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా విరుచుకుపడ్డారు. పాకిస్తాన్ మీద కాంగ్రెస్ పార్టీ ప్రేమ, అభిమానం అజరామరమని, గురువు నుంచి శిష్యుడి దాకా అదే వ్యామోహం అంటూ ఎద్దేవా చేవారు. సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సింధూర్‌ను చులకన చేస్తూ, భారత సైనికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిపోయిందని మండిపడ్డారు. పాకిస్తాన్‌కు మద్దతుగా మాట్లాడుతూ భారత ఆర్మీని అగౌరవ పరుస్తున్నామనే సోయి లేకుండా కాంగ్రెస్ పార్టీ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాక్ వైపు స్టాండ్ తీసుకొని శత్రు దేశం భాషలో మాట్లాడుతూ శత్రువుల మాటలను సిగ్గులేకుండా వల్లె వేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రాజ్యాంగబద్ధ హోదాలో ఉండి కూడా నిజానిజాలు తెలియకుండా, దేశానికి వ్యతిరేకంగా మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. ముఖ్యమంత్రికి తెలియని విషయం ఏంటంటే, పాకిస్తాన్ భూభాగంలో దాక్కున్న ఉగ్రవాదులను, వారి స్థావరాలను భారత గైడెడ్ క్షిపణులు విజయవంతంగా మట్టుబెట్టాయని, 11 ఎయిర్ బేస్‌లను పూర్తిగా ధ్వంసం చేశాయని అన్నారు. ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకులు ముందు ఈ విషయాలను తెలుసుకుని మాట్లాడాలని కిషన్ రెడ్డి హితవు పలికారు.

బీఆర్ఎస్ అఖండ విజయం ఖాయం

మొదటిపేజీ తరువాయి

కోసం ముఖ్యమంత్రి, 14 మంది మంత్రులు గల్లీ గల్లీ తిరుగుతున్నారని, రెండు సంవత్సరాలలో కాంగ్రెస్ ఒక్క మంచి పని కూడా చేయలేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. మహిళలకు రూ. నాలుగు వేల పింఛన్, యువతులకు స్కూటీలు, నిరుద్యోగులకు భృతి, రెండు లక్షల ఉద్యోగాలు అని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందని అన్నారు. "కేసీఆర్ కిట్ లేదు, రంజాన్ తోఫా లేదు, క్రిస్మస్ గిఫ్ట్ లేదు, బతుకమ్మ చీర లేదు అన్నీ రద్దయిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజలు ఆయనకు తగిన బుద్ధి చెబుతారు

'రేవంత్ రెడ్డి ప్రజలను బెదిరిస్తున్నారు. కానీ, ఈ చైతన్యవంతమైన తెలంగాణ ప్రజలు ఆయనకు తగిన బుద్ధి చెబుతారు. ఎన్నో నియంతలకు బుద్ధి చెప్పిన చరిత్ర తెలంగాణ గడ్డదే' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీ మధ్య లోతైన సంబంధం ఉందని ఆరోపించారు. 'రేవంత్ రెడ్డికి కాంగ్రెస్‌తో ఉన్నది ఫేక్ బంధం, బీజేపీతో ఉన్నది పేగు బంధం' అన్నారు. 'కేసీఆర్ ఉన్నప్పుడు తెలంగాణ నంబర్ వన్‌గా ఉండేది, ఇప్పుడు లాస్ట్ ప్లేస్‌కి చేరింది' అని పేర్కొన్నారు. మాగంటి సునీతకు ఒక్క అవకాశం ఇవ్వాలని, జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలవాలని. కారు గుర్తుకు ఓటేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లో నాలుగు లక్షల మంది ఓటేస్తే, నాలుగు కోట్ల మందికి మేలు జరుగుతుందన్నారు. 'కాంగ్రెస్‌కు ఓటేస్తే ధోకా, కారు గుర్తుకు ఓటేస్తే తెలంగాణకు మేలు' అని కేటీఆర్ అన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- చార్జి షీటు విడుదల చేసిన బీజేపీ నేతలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 1: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 23 నెలలు పూర్తవుతున్నా, ఆ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు, ఆరు గ్యారెంటీలు, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో తీవ్ర వైఫల్యం చెందిందంటూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం చార్జ్‌షీట్ విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల ముందు 100 రోజులలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిందని, 1000 రోజులు గడిచినా, ఒక్క హామీ కూడా నెరవేర్చలేకపోయిందని పేర్కొంది. 'తెలంగాణ పేదల మీద కాంగ్రెస్ పెట్టిన ఈ హస్తం నిజానికి అభయ హస్తం కాదు భస్మాసుర హస్తం' అని విమర్శించింది. ఈ సమావేశంలో బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు లక్ష్మీ బసవ నరసయ్య, పార్టీ సీనియర్ నాయకులు ప్రకాశ్ రెడ్డి, సంగప్ప, దిలీప్ ఆచారి పాల్గొన్నారు.

కాప్రా మల్కాజగిరి కవుల అంతర్జాల వేదిక

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 1: అంతర్జాలంలో కాప్రా మల్కాజగిరి కవుల వేదిక 13వ సమావేశం ఆసాంతం అద్భుతంగా జరిగింది. ముఖ్య అతిథి అంతర్జాతీయ తెలుగు కవి డాక్టర్ పెరుగు రామక్రిష్ణ వచన కవిత్వ నిర్మాణ పద్ధతుల గురించి చక్కని ప్రసంగం చేశారు. కుందుర్తి ఆంజనేయులు, శ్రీశ్రీ, శేషేంద్ర శర్మ మొదలగు కవుల కవితలను ఉదహరించారు. వచన కవితల ప్రాథమిక లక్షణాలైన స్వేచ్ఛాయుత నిర్మాణము, భావ ప్రవాహ ఆధారిత నిర్మాణము, దృశ్యమాన చిత్రాలతో ప్రదర్శనము, సామాజిక స్పృహ మరియు భాషా సరళత గమ్యము గురించి సోదాహరణంగా వివరించారు. మౌనశ్రీ మల్లిక్ మొదటగా సాహితీమూర్తులను ఆహ్వానించారు. విశిష్ట అతిథి, విశ్రాంత అటవీ శాఖ అధికారి అంబటి లింగ క్రిష్ణారెడ్డి కవులు పదికాలాల పాటు ప్రజల నాలుకలలో నిలిచిపోయే కవితలను రాయాలన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్ వేదిక లక్ష్యాలను, నిర్వాహకులు తీసుకుంటున్న చర్యలను వివరించారు. అతిథులకు డాక్టర్ తులసి వెంకట రమణాచార్యులు ఆహ్వానం పలికారు.

"

రేవంత్ నకిలీ వాగ్దానాలు, బెదిరింపు రాజకీయాలు జూబ్లీహిల్స్ ఓటమితోనే అంతమవుతాయి. కేసీఆర్ తిరిగి సీఎం అవుతారు. ఎందరో నియంతలు పతనమయ్యారు. తర్వాత రేవంతే. జూబ్లీహిల్స్‌లో భారీ మెజార్టీతో గెలుస్తాం. రేవంత్ చేసే బెదిరింపు రాజకీయాలకు భయపడేది లేదు. రేవంత్‌కు కాంగ్రెస్‌తో ఉన్నది ఫేక్ బంధం. బీజేపీతో ఉన్నది పేగు బంధం.

- కేటీఆర్. బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్

రాష్ట్రీయం

సానుభూతి పేరిట ఓట్ల వేట

- సంప్రదాయాలను కేసీఆర్ తుంగలో తొక్కారు
- పీజేఆర్ మరణం తరువాత అభ్యర్థిని నిలిపారు
- ఆయన కుటుంబాన్ని అనేకంగా అవమానించారు
- నవీన్ యాదవ్ ను భారీ మెజారిటీతో గెలిపించండి
- ఎర్రగడ్డ డివిజన్ కార్నర్ మీటింగ్ లో సీఎం రేవంత్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 1: బీఆర్ఎస్ పార్టీ సానుభూతితో ఓట్లు దండుకోవాలని ప్రయత్నిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం రాత్రి ఆయన ఎర్రగడ్డ డివిజన్ లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ లో మాట్లాడారు. గత సంప్రదాయాలను కేసీఆర్ తుంగలో తొక్కారని ఆరోపించారు. సెంటిమెంట్ పేరుతో బీఆర్ఎస్ నేతలు జనం ముందుకు వస్తున్నారన్నారు. 2007 లో పీజేఆర్ ఆకస్మికంగా చనిపోతే, ఏకగ్రీవంగా చేయాలంటే, అభ్యర్థిని పెట్టి కేసీఆర్ ఎన్నికలు తెచ్చారని విమర్శించారు. ఆనాడు పీజేఆర్ కుటుంబాన్ని మూడు గంటలు బయట నిలబెట్టి అవమానించారన్నారు. పీజేఆర్ కుటుంబంపై పోటీ పెట్టి కేసీఆర్ సంప్రదాయాన్ని తుంగలో తొక్కారన్నారు. కారు షెడ్డుకు పోయిందని బిల్లా రంగా ఆటోలలో తిరుగుతున్నారన్నారు. 'జూబ్లీహిల్స్ లో సమస్యలు పేరుకుపోవడానికి కారణం నువ్వు మీ అయ్య కాదా కేటీఆర్! పదేండ్లు అధికారంలో ఉన్న మీరు సమస్యలు పరిష్కరించి ఉంటే జూబ్లీహిల్స్ కు ఈ పరిస్థితి వచ్చేదా? పదేళ్లు అధికారంలో ఉండి మైనారిటీల సమస్యలు ఎందుకు పరిష్కరించలేదు? మా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 70 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశాం. ఈ బస్తీలలో రేషన్ కార్డులు ఇచ్చింది మేం కాదా? 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చి మిమ్మల్ని ఆదుకున్నది కాంగ్రెస్ కాదా? పేదలందరికీ సన్నబియ్యం ఇస్తున్నది మేం కాదా?' అని రేవంత్ నిలదీశారు. ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని సొంత చెల్లెలిని ఇంటి నుంచి పంపిన కేటీఆర్ సునీతమ్మను మంచిగా చూసుకుంటారా! అంటూ ఎద్దేవా చేశారు. 'సొంత చెల్లికి అన్నం పెట్టని వాడు పిన్నమ్మ కూతురికి బంగారు గాజులు' పెడతారంటే నమ్ముతారా? అంటూ నిలదీశారు.

కంటోన్మెంట్ అభివృద్ధి

'కంటోన్మెంట్ ఉపఎన్నికలో శ్రీ గణేష్ ను గెలిపించగానే ఆ నియోజకవర్గాన్ని నాలుగు వేల కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం. జూబ్లీహిల్స్ లో అభివృద్ధి జరగాలంటే నవీన్ యాదవ్ ను గెలిపించండి. అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇస్తే కిషన్ రెడ్డి జాగీర్ ఏమైనా పోతుందా? ఎందుకు అడ్డుకోవాలని చూశారు? ఆనాడు కూడా పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్ పని చేసింది. ఇప్పుడు బీజేపీ వాళ్లు బీఆర్ఎస్ ను గెలిపించేందుకు పని చేస్తున్నారు. కేంద్రంలో ప్రతీ సందర్భంలో మోడీకి కెసీఆర్ మద్దతు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మైనారిటీలకు మేలు జరుగుతుంది. మీ బిడ్డ నవీన్ యాదవ్ ను గెలిపించండి. ఎమ్మెల్యేగా నవీన్, మంత్రిగా అజారుద్దీన్ అండగా ఉంటారు. పీజేఆర్ తరువాత జూబ్లీహిల్స్ కు నాయకుడు లేకుండాపోయారు. పీజేఆర్ వారసత్వాన్ని నవీన్ యాదవ్ కొనసాగిస్తారు. పేదలకు అండగా ఉంటారు. నవీన్ యాదవ్ ను 30 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించండి' అని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు.

రాహుల్ ప్రధాని అయితేనే దేశ భవిష్యత్

- ఇందిర ప్రపంచ దేశాలను శాసించారు
- ప్రపంచ దేశాలు మోడీని శాసిస్తున్నాయి
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, నవంబర్ 1: దేశ ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆనాడు ఇందిరాగాంధీ ప్రపంచ దేశాలను శాసిస్తే, ఈనాడు ప్రపంచ దేశాలు ప్రధాని మోడీని శాసిస్తున్నాయన్నారు. తెలంగాణలో 14 మంది ఎంపీలను, ఆంధ్ర ప్రదేశ్ లో 20 మంది ఎంపీలను గెలిపిస్తే రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవుతారన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే తెలంగాణ అభివృద్ధి కావడంతో పాటు ఆంధ్ర ప్రదేశ్ కు ప్రత్యేక ప్యాకేజీ, వైజాగ్ స్టీల్ ప్లాంట్ సమస్య పరిష్కారం, పోలవరం పూర్తి అవుతుందన్నారు. తెలంగాణ, ఏపీ ప్రజలు ఇప్పటినుండే ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేసారు. దేశం సాఫ్ట్ వేర్, ఐటీ రంగాలలో అభివృద్ధి సాధించిందంటే, అందుకు కారణం రాజీవ్ గాంధీ సాఫ్ట్ వేర్, ఐటీ రంగాలలో ఈనాడు కోట్ల మంది ప్రజలు ఉద్యోగాలు చేస్తున్నారంటే ఆనాడు రాజీవ్ గాంధీ చేసిన కృషే కారణ మన్నారు. ఈ విషయాన్ని కూడా ప్రజలు గమనించాలన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం హయాంలో ఉపాధి హామీ పథకం తీసుకువచ్చి పేదలకు ఉపాధి కల్పించారన్నారు.ఈ పదేండ్ల బీజేపీ ప్రభుత్వంలో మహిళలకు ఉపాధి, యువతకు ఉద్యోగాలు, పేదలకు న్యాయం జరిగిందని చెప్పగలరా? అని ప్రశ్నించారు.

మారుతున్న మెట్రో రైలు సమయాలు

- రేపటి నుంచే అమలులోకి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 1: మెట్రో రైలు సమయాలలో సోమవారం నుంచి స్వల్పంగా మార్పులు చోటు చేసుకుంటాయని ఎల్అండ్ టీ ప్రకటించింది. రోజూ అన్ని టెర్మినల్స్ నుంచి ఉదయం 6 గంటలకు మొదటి రైలు బయలుదేరుతుందని, రాత్రి 11 గంటలకు చివరి రైలు ఉంటుందని తెలిపింది. ప్రస్తుతం కొనసాగుతున్న సమయాన్ని 45 నిమిషాలు కుదించామని వెల్లడించింది. ప్రయాణికులు గమనించాలని కోరింది. ప్రస్తుతం కొనసాగుతున్న మెట్రో సమయాలు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 6 గంటలకు మొదటి మెట్రో, రాత్రి 11.45 గంటలకు చివరి మెట్రో రైలు బయలుదేరుతుంది. శనివారం ఉదయం 6 గంటలకు మొదటి మెట్రో, రాత్రి 11 గంటలకు చివరి మెట్రో రైలు బయలుదేరుతుంది. ఆదివారం మాత్రం ఉదయం 7 గంటలకు మొదటి మెట్రో రైలు, రాత్రి 11గంటలకు చివరి మెట్రో రైలు బయలుదేరుతుంది కానీ. సోమవారం నుంచి అన్ని రోజులలో అన్ని టెర్మినల్స్ నుంచి ఉదయం 6 గంటలకు మొదటి మెట్రో, రాత్రి 11 గంటలకు చివరి మెట్రో బయలుదేరుతుందని మెట్రో స్పష్టం చేసింది.

తుఫాన్ నష్టంపై అంచనాలు సమర్పించండి

- కలెక్టర్లకు సీఎస్ రామకృష్ణారావు ఆదేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 1: మొంథా తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో జరిగిన నష్టాన్ని అంచనా వేసి వెంటనే ప్రభుత్వానికి సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు కలెక్టర్లను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో దాదాపు 24 జిల్లాలు ఈ మొంథా తుఫాన్ కు ప్రభావితమయ్యాయని తెలిపారు. జిల్లాలలో జరిగిన పంట నష్టం తో పాటు, రహదారులు, నీటి వనరులు, పశువులు, ప్రాణ నష్టంతో పాటు ఇతర ప్రాథమిక వివరాలను వెంటనే ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. ఇటీవల కాలంలో ఏవిధమైన సూచనలు లేకుండా 25 నుండి 30 సెంటీమీటర్ల వర్షపాతం ఆకస్మికంగా కురుస్తోందని, ఈ నేపథ్యంలో అత్యవసర సమయంలో చేపట్టాల్సిన చర్యలపై ముందస్తు ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. తరచుగా ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. పరిహారం అందించేందుకు వీలుగా నష్టం వివరాలను సోమవారం వరకు పంపించాల్సిందిగా కోరారు. ఎలాంటి అలసత్వం లేకుండా పునరావాస చర్యలు తీసుకోవాలని కోరారు.

చెర వీడనున్న దేవాలయ భూములు

- చట్టం చేసేందుకు సర్కార్ నిర్ణయం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 1 : తెలంగాణ దేవాదాయ భూముల రక్షణకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ ఎండోమెంట్ యాక్ట్, 1987 చాప్టర్ 11 సవరణకు కసరత్తు చేస్తోంది. సెక్షన్స్ 83, 84 తొలగించాలని నిర్ణయం తీసుకుంది. వచ్చే అసెంబ్లీ సమావేశాలలో ఈ మేరకు బిల్లు ప్రవేశపెట్టనుంది. ట్రిబ్యునల్, పలు కోర్టు కేసులతో దర్జాగా వేల ఎకరాలు కబ్జా చేస్తున్న వాళ్ల ఆట కట్టించేందుకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దాదాపు వందల ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయని, వీటన్నింటిని పరిరక్షించాలని ప్రభుత్వం చూస్తోంది. కబ్జా కోరలలో చిక్కుకున్న వేల కోట్ల విలువైన దేవాదాయ భూములను రక్షించేందుకు నడుం బిగించింది. దేవాలయ, చారిటబుల్ సంస్థలకు చెందిన భూములు, భవనాలను ఎవరు ఆక్రమించినా వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంది.

'క్రియేటివిటీ హబ్'గా హైదరాబాద్

- వీఎఫ్ఎక్స్, గేమింగ్ అభివృద్ధికి సహకారం
- 'ఇండియాజాయ్ 2025' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 1: నగరాన్ని ఐటీ రాజధానిగానే కాదు, భారతదేశపు క్రియేటివిటీ హబ్ గానూ తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ వీఎఫ్ఎక్స్ యానిమేషన్ అండ్ గేమింగ్ అసోసియేషన్ (టీవీఏజీఏ) సంయుక్త ఆధ్వర్యంలో హైటెక్ సిటీలోని హెచ్ఐసీసీలో రెండు రోజుల పాటు 'ఇండియాజాయ్ 2025' పేరిట నిర్వహించనున్న 'ఇండియాస్ ప్రీమియర్ మీడియా అండ్ ఎంటర్టైన్మెంట్ కాంగ్రెగేషన్'ను శనివారం నాడు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతికత, సృజనాత్మకత కలిసే చోటుగా హైదరాబాద్ పిక్సెల్, కవిత్వం, అవకాశాల నగరంగా ప్రపంచానికి మార్గ నిర్దేశం చేస్తుందని వివరించారు. క్రియేటివ్ రంగానికి చేయుతనిచ్చేలా క్రియేటివ్ ఫ్యూచర్స్ ఫండ్, ఈస్పోర్ట్స్ అకాడమీ, మహిళా క్రియేటర్ల కోసం ప్రత్యేక ప్లాట్ ఫామ్ ను ప్రభుత్వంతో కలిసి ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని దిగ్గజ సంస్థలకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 3.1 బిలియన్ డాలర్లుగా ఉన్న భారతదేశ గేమింగ్ పరిశ్రమ విలువ 20 శాతం సీఏజీఆర్ తో 2028 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్నారు. భారతదేశ మొత్తం వీఎఫ్ఎక్స్ అవుట్ పుట్ లో మన వాటా సుమారు 25 శాతం ఉండటం మనకు గర్వకారణమన్నారు. హైదరాబాద్ ఓటీటీ కంటెంట్ ప్రొడక్షన్ లో 35 శాతం వృద్ధి రేటు నమోదు కావడం ఇక్కడి ఎకోసిస్టం పై ఉన్న నమ్మకానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు, తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ దిల్ రాజు, యువ కథానాయకుడు తేజ సజ్జా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్, టీవీఏజీఏ ప్రెసిడెంట్ రాజీవ్ చిలక, కార్యదర్శి మాధవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబా ఫసియుద్దీన్‌ను బైండోవర్ చేయండి

- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 1: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓటర్లను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్న కాంగ్రెస్ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్‌పై బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. బాబా ఫసియుద్దీన్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. బెదిరింపులకు పాల్పడి సర్దార్ అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకునేందుకు కారణమయ్యాడన్నారు. బహిరంగంగా అందరినీ బెదిరిస్తున్న బాబా ఫసీయుద్దీన్‌ను పోలీసులు ఎందుకు బైండోవర్ చేయడం లేదని ప్రశ్నించారు. ఐదు నెలలు గడిచినా ఈ కేసులో పురోగతి లేదని. పైగా అతనికే గన్‌మెన్లను ఇచ్చి స్టార్ క్యాంపెయినర్‌ను చేసి మంత్రుల వెంట తిప్పుతున్నారని పేర్కొన్నారు. 'కాంగ్రెస్ పార్టీకి ఒక న్యాయం ఇతరులకు మరొక న్యాయమా? అని ఈసీని, సీపీని ప్రశ్నించారు. వెంటనే బాబాను అరెస్ట్ చేసి, రౌడీషీట్ ఓపెన్ చేసి జైలుకు పంపాలని, లేదంటే బోరబండలో ఎన్నికలు సజావుగా సాగే పరిస్థితి లేదని ఆర్ఎస్పీ పేర్కొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 1: రాష్ట్రంలో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్‌లో దళిత మహిళపై జరిగిన అత్యాచార ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి హోమ్ మంత్రిగా ఉన్నా, రాష్ట్రంలో శాంతిభద్రతలు సరిగా లేవన్నారు. మహిళలపై నేరాలు పెరుగుతున్నా ఆయన సమీక్షలు చేయడం లేదన్నారు. నేషనల్ హైవే పక్కనే అత్యాచారం జరిగిందని, రేవంత్‌రెడ్డి కనీసం ఘటనపై ఆరా తీశారా? అని ప్రశ్నించారు. అధికార పార్టీకి దగ్గరగా ఉన్నందున పోలీసులు బాధ్యతగా వ్యవహరించడం లేదన్నారు. మహిళా మంత్రులు తమ సంపాదనకే ప్రాధాన్యత ఇస్తున్నారు కానీ, మహిళల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. కేసీఆర్ హయాంలో షీటీమ్స్ మహిళలకు రక్షణ కవచంలా పనిచేశాయని, సీసీటీవీ కెమెరాలు భారీ సంఖ్యలో ఏర్పాటు చేశారని అన్నారు, ఇప్పుడు అవి పని చేయడం లేదని ఆమె విమర్శించారు. మహిళలపై నేరాలు ఆగకపోతే బీఆర్ఎస్ తగిన కార్యాచరణ ప్రకటిస్తుందన్నారు. ఈ సమావేశంలో హేమ, నివేదిత, షకీలా రెడ్డి, అనితా ప్రభాకర్, ప్రసన్నలక్ష్మి, సునీత తదితర మహిళా కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు డిపోలో విజిలెన్స్ వారోత్సవాలు

- నిజాయితీగా ఉంటామని సిబ్బంది ప్రతిజ్ఞ

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 1: స్థానిక ఆర్టీసీ బస్సు డిపోలో విజిలెన్స్ వారం కొనసాగుతోంది. గత నెల 27న ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈనెల రెండో తేదీ వరకు కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఎస్టీఐ మురళి, డిపో హెడ్ కానిస్టేబుల్ రంజిత్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. 'నైతిక వ్యాపార పద్ధతులను ప్రోత్సహించి నిజాయితీ, నిబద్ధత కలిగిన సంస్కృతితో పాటు లంచాలు ఇవ్వం, తీసుకోమని, మంచి సంస్థ పాలనకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ నిర్వహించారు. ఫిర్యాదుల పరిష్కారం, విజిల్ బ్లోయర్ విధానాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా ఫిర్యాదులు, మోసపూరిత చర్యలను నివేదించగలుగుతామని, అంతేకాకుండా సమాజం హక్కులు ప్రయోజనాలను రక్షిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంటు కట్ట మల్లు, అకౌంటెంట్ లక్ష్మారెడ్డి, కానిస్టేబుల్ శివశంకర్, లీడింగ్ హెడ్ పోశయ్య, సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఇగ్నో' టీచర్స్ యూనియన్ ఎన్నికలు

- ఈసీ మెంబరుగా డా. వీరమల్ల శ్రీశైలం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 1: ఇగ్నో టీచర్స్ యూనియన్ ఎన్నికలలో ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ విద్యార్థి నాయకుడు, ఇగ్నో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. వీరమల్ల శ్రీశైలం 150 ఓట్ల అత్యధిక ఆధిక్యంతో ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ గా విజయం సాధించారు. డా. వీరమల్ల శ్రీశైలం ఉస్మానియా వర్సిటీ విద్యార్థి నాయకునిగా తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. ఏబీవీపీ అధ్యక్షుడుగా, జాతీయ కార్యవర్గ సభ్యుడుగా అనేక బాధ్యతలు నిర్వర్తించి విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. స్వగ్రామం వెలిమినేడు, చిట్యాల మండలం, నల్గొండ జిల్లాలో వాతావరణాన్ని కాలుష్యం చేస్తున్న కంపెనీలను మూసివేయాలని అనేక ఉద్యమాలు చేశారు. ఇక సమాజ నిర్మాణం, వర్సిటీ ప్రొఫెసర్ల సమస్యలు, విద్యా సంస్కరణలపై నిర్మాణాత్మక భూమిక పోషించనున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్లు, ఉద్యోగులు, బంధు మిత్రులు శుభాకాంక్షలు తెలియజేశారు.

2047 నాటికి భారత్ విశ్వ గురువు కావాలి

- అందుకు అనుగుణంగా ఎదగాలి
- లీడ్ ఇండియా అధ్యక్షుడు బుర్ర మధుసూదన్ రెడ్డి

ప్రతిపక్షం కరీంనగర్ బ్యూరో, నవంబర్ 1: శతాబ్ది స్వాతంత్ర్య దినోత్సవం నాటికి భారత్ విశ్వ గురువుగా గుర్తింపు పొందడానికి నేటి పాఠశాల విద్యార్థులు, రేపటి యువత నైపుణ్య విద్య, అత్యుత్తమ వ్యక్తిత్వ వికాసం స్వంతం చేసుకోవాలని కరీంనగర్ లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. లీడ్ ఇండియా ఫౌండేషన్ సారథ్యంలో నాగేశ్వరీ డిగ్రీ పిజీ కాలేజీ సమావేశ మందిరంలో శనివారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి విద్యలో ముందుంటూ విలువలు కలిగి జీవితాన్ని గడిపేలా ఉండాలని అన్నారు. పాఠశాల విద్యార్థులు 2047 నాటికి 30 యేండ్లు దాటి యువశక్తిని జాతి సమగ్రాభివృద్ధికి కృషి చేసే విధంగా నేడు పటిష్ఠ పునాదులను నిర్మించుకోవాలని అన్నారు. జీతం మాత్రమే జీవితం కాదని, జీవితాన్ని ఆస్వాదించడానికి, పౌర సమాజంలో గుర్తింపు పొందడానికి అవసరమైన పాఠాలు నేర్చుకోవడానికి లీడ్ ఇండియా శిక్షణ ఉపయోగపడుతుందని అన్నారు. మాస్టర్ ట్రెయినర్స్ శ్రీనివాసాచారి, శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు.

"జూబ్లీహిల్స్‌లో సానుభూతితో ఓట్లు దండుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. పదేళ్ల పాటు మైనార్టీ సమస్యలు పట్టించుకోలేదు. మా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి 70వేల ఉద్యోగాలిచ్చాం. ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని సొంత చెల్లెలిని ఇంటి నుంచి పంపిన కేటీఆర్, సునీతను బాగా చూసుకుంటారా?.

-సీఎం రేవంత్‌రెడ్డి

ప్రతిపక్షం
Prathipaksham.in
4
హైదరాబాద్
ఆదివారం
02.11.2025
@prathipaksham
prathipakshamtvtelugu

మద్యం లేని గ్రామం అంటే పిల్లల నవ్వులు మోగే ఇల్లు, రాత్రిళ్లు మత్తు కాకుండా మమకారం, పొలాలలో కష్టపడే చేతులు, పల్లె గాలిలో సుగంధం. అది కల కాదు, సాధ్యమే. మద్యం తాగకపోవడం ఒక విప్లవం లాంటిది అది మనలోని మనిషిని రక్షించే విప్లవం. చివరిగా ఒక్క మాట : మద్యం పట్ల ఆకర్షణ తాత్కాలిక మజా ఇస్తుంది కానీ, శాశ్వతమైన నష్టాన్ని మిగులుస్తుంది. మద్యం మనిషిని మత్తులో కాకుండా మట్టిలో కలిపేస్తుంది. యువతే దేశ భవిష్యత్తు. ఆ యువత మద్యం మత్తులో మునిగితే, దేశం భవిష్యత్తు కూడా మసకబారుతుంది. కాబట్టి ఇప్పుడే నిర్ణయం తీసుకోవాలి. మద్యం కాదు, మన భవిష్యత్తే మన మత్తు కావాలి.

మద్యం ఆకర్షణ: యువత నాశనానికి దారి

జనగాం ప్రసాద్ రావు
76720 82695

ఒకప్పుడు గ్రామ జీవితమంటే ఉషోదయాన్నే మేల్కొని పొలాలలో కష్టపడే రైతులు, వీధుల వెంట పరుగెత్తే పిల్లల కేరింతలు, సాయంత్రం గడపలపై కూర్చుని మమకారంగా మాట్లాడుకునే పెద్దలు. కానీ, నేడు అదే గ్రామాలు మద్యం వాసనతో నిండిపోయాయి. ప్రతి మలుపులో ఒక బాటిల్ షాప్, ప్రతి వీధిలో కొందరు యువకులు పూర్తిగా మత్తులో తూలుతున్న దృశ్యం ఇది. మన గ్రామాల కొత్త వాస్తవం. ఆకర్షణకు ఆరంభం ఎక్కడి నుంచి మొదలైనది అనేది చూస్తే యువతలో మద్యం పట్ల ఆసక్తి క్రమంగా పెరుగుతోంది. ఆరంభంలో అది 'ఫ్రెండ్స్ సరదా'గా మొదలవుతుంది. 'ఒకసారి తాగితే ఏమవుతుంది' అనే ఉత్సాహం, 'మిత్రులు అందరూ తాగుతుంటే నేను ఎందుకు తాగకూడదు?' అనే ఆలోచన, సినిమాలలో హీరోలు తాగడం చూపించే దృశ్యాలు ఇవన్నీ కలిపి మద్యం వైపు తొలి ప్రేరణగా మారుతున్నాయి. అటు పార్టీలు, ఫంక్షన్లు, బర్త్‌డే వేడుకలు ఇవి అంతా ఇప్పుడు మద్యం లేకుండా 'అసంపూర్ణం'గా భావిస్తున్నారు. సామాజిక ఒత్తిడి, ఆత్మగౌరవం అనే పేర్లతో యువత తమ జీవితాలలోకి ఈ విషాన్ని ఆహ్వానిస్తున్నారు. గ్రామాలలో నిరుద్యోగం ఒక పెద్ద వ్యాధి. రోజువారీ కూలీలు కొంత పని దొరికినా,ఎప్పుడూ ఖాళీగా ఉండే రోజులు ఎక్కువే. ఆ నిరాశ, ఒత్తిడి, నిస్పృహ ఇవి కలిసి యువతను మద్యం వైపు నెడుతున్నాయి. 'ఒక గ్లాసు తాగితే టెన్షన్ పోతుంది' అని మొదలు పెట్టిన వారు, ఆ తర్వాత ఆ టెన్షన్‌నే జీవితమంతా తెచ్చుకుంటున్నారు. మద్యం తాగడం ఓ అలవాటు కాదు, అది క్రమంగా ఆత్మవినాశానికి దారి తీసే బంధనం.

మద్యం వల్ల కలిగే వ్యక్తిగత నష్టం

మద్యం మొదట మానసిక సంతృప్తిని ఇస్తుంది. తర్వాత శరీరాన్ని తినేస్తుంది. కాలేయం దెబ్బతినడం, రక్తపోటు పెరగడం, మానసిక స్థితి అస్థిరం కావడం ఇవన్నీ మద్యం మిత్రులే. ఇక తాగకపోతే అసహనం, కంపనలు, ఆందోళనలు. ఇలా ఒక మనిషి తన శరీరంపై నియంత్రణ కోల్పోతాడు. వెన్నుపామున కత్తి పెట్టినట్టు, మద్యం మనిషి జీవాన్ని నెమ్మదిగా నశింపజేస్తుంది. మద్యం తాగేవాడు ఓ వ్యక్తి మాత్రమే అయినా, దాని బాధ మొత్తం కుటుంబం అనుభవిస్తుంది. పిల్లలు పాఠశాలకు ఫీజులు అడిగితే, తండ్రి చేతిలో ఉన్నది బాటిల్ బిల్ మాత్రమే. భార్యాభర్తల మధ్య గొడవలు, మద్యం మత్తులో మాటల దెబ్బలు, తర్వాత చేతి దెబ్బలు. ఒకప్పుడు నవ్వులతో నిండిన ఇల్లు, ఇప్పుడు కన్నీళ్లతో నిండిన గది. మద్యం వల్ల ఎన్నో మహిళలు విధవలయ్యారు. పిల్లలు అనాథలయ్యారు. అయినా సమాజం ఈ నాశనాన్ని 'సాధారణం'గా చూస్తోంది. గ్రామీణ సమాజం మీద దుష్ప్రభావం అనేది మద్యం వల్ల గ్రామ జీవన రీతిలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. సాయంత్రం రైతులు కూలీలు కలసి మాట్లాడుకునే వేదికలూ, ఇప్పుడు బాటిల్ షాపుల ముందు క్యూలుగా మారిపోయాయి. పెద్దల మాట వినకపోవడం, సామాజిక గౌరవం కోల్పోవడం, వివాదాలు, గొడవలు, హింస ఇవన్నీ మద్యం మూలాలు. అనేక గ్రామాలలో మద్యం మత్తులో జరిగిన గొడవలతో ప్రాణాలు పోతున్నాయి. ఒక చిన్నమాట తగువుగా మొదలై, పలువురి జీవితాలు చీకటిలో మునిగిపోతున్నాయి.

మద్యం లేని గ్రామం మన కల

కష్టపడి సంపాదించి మత్తులో ముంచి

ఒక కూలీ రోజుకి 300 రూపాయలు సంపాదిస్తే, అందులో 250 రూపాయలు మద్యం మీద వెచ్చిస్తాడు. ఆ రోజు ఇంటికి అన్నం రాదు, పిల్లలకి పాలు రావు. కానీ, షాపుకి మాత్రం కస్టమర్ రెడీగా ఉంటాడు. ఈ పరిస్థితి ఒక్క కుటుంబానికే కాదు, గ్రామం మొత్తానికి ఆర్థిక బలహీనత తీసుకువస్తోంది. మద్యం అమ్మకాలు పెరుగుతున్న కొద్దీ, గ్రామం పేదరికంలో కూరుకుపోతుంది. సమాజమా! ఇప్పటికైనా మేల్కోవాలి. ఇప్పటికైనా ఈ విషాన్ని గుర్తించాలి. మద్యం దుకాణాల సంఖ్య పెరిగితే, అభివృద్ధి కాదు అది నాశనానికి దారి. పాఠశాలలలోనే విద్యార్థులకు మద్యం దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలి.

గ్రామసభలో పెద్దలు, యువకులు కలసి చర్చించాలి. మద్యం మానిన వారిని ఆదర్శంగా చూపాలి. 'మద్యం లేకుండా జీవించడం బోరింగ్ కాదు, అది గర్వకారణం' అని యువత మనసులో నాటుకోవాలి. మార్పు ఎక్కడి నుంచి మొదలవ్వాలి అని చూస్తే, మార్పు ప్రభుత్వంతో కాదు, ప్రతి యువకుడి మనసులో మొదలవ్వాలి. 'నేను మద్యం మానేస్తే ఏమవుతుంది?' అని కాకుండా, 'నేను మానితే నా కుటుంబం బాగుపడుతుంది' అని ఆలోచించాలి. గ్రామంలో ఒక యువకుడు మద్యం మానితే, అతని స్నేహితుడు కూడా ఆలోచిస్తాడు. అలా ఒక ఊరు మారుతుంది. ఒక సమాజం పునరుజ్జీవిస్తుంది.

మద్యం లేని గ్రామం అంటే పిల్లల నవ్వులు మోగే ఇల్లు, రాత్రిళ్లు మత్తు కాకుండా మమకారం, పొలాలలో కష్టపడే చేతులు, పల్లె గాలిలో సుగంధం. అది కల కాదు, సాధ్యమే. మద్యం తాగకపోవడం ఒక విప్లవం లాంటిది అది మనలోని మనిషిని రక్షించే విప్లవం. చివరిగా నా మాట : మద్యం పట్ల ఆకర్షణ తాత్కాలిక మజా ఇస్తుంది కానీ, శాశ్వతమైన నష్టాన్ని మిగులుస్తుంది. మద్యం మనిషిని మత్తులో కాకుండా మట్టిలో కలిపేస్తుంది. యువతే దేశ భవిష్యత్తు. ఆ యువత మద్యం మత్తులో మునిగితే, దేశం భవిష్యత్తు కూడా మసకబారుతుంది. కాబట్టి ఇప్పుడే నిర్ణయం తీసుకోవాలి. మద్యం కాదు, మన భవిష్యత్తే మన మత్తు కావాలి.

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు, పూసూరు)

ఫేక్ న్యూస్ రాజకీయాల కొత్త ఆయుధం

ఇటువంటి అబద్ధాలను 'ఇది ఫేక్ న్యూస్' అని చెప్పి వదిలేస్తే సరిపోదు. బాధ్యులను గుర్తించి శిక్షించాలి. మీడియా సంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రజలు, అందరూ కలిసి సత్యానికి మద్దతు పలకాలి. వెంటనే కాంగ్రెస్ స్పందించి దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని శిక్షించాలి. సర్కులేషన్ లో ఉన్న తప్పుడు వార్తను తొలగించి, బాధ్యులతో క్షమాపణ చెప్పించాలి. తన పేరును ఇలా దుర్వినియోగం చేస్తున్నందుకు సదరు పత్రిక కూడా చట్టపర చర్యలు తీసుకోవాలి. స్వేచ్ఛ పేరుతో సోషల్ మీడియాలో ఇష్టమొచ్చిన నిందలు మోపడం. ప్రధాన సంస్థలు తమ పేరు, లోగోను దుర్వినియోగం చేసినప్పుడు కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి దుర్మార్గపు ప్రయత్నాలు తగ్గుముఖం పడతాయి.

ఎండీ ఉస్మాన్ ఖాన్
99125 80645

ఇటీవలి కాలంలో సోషల్ మీడియా ఒక పెద్ద యుద్ధరంగమైపోయింది. ఇక్కడ బుల్లెట్లు కాదు, బయటికి నిజంలా కనిపించే అబద్ధాలు పేలుతుంటాయి. ఈ అబద్ధాలు ఒక్కొక్కటి ఒక సమాజాన్ని, ఒక వ్యక్తిని, ఒక రాజకీయ పార్టీని నాశనం చేయగల శక్తిని కలిగివున్నాయి. ఈ 'ఫేక్ న్యూస్' ఇప్పటి రాజకీయాలకు సరికొత్త ఆయుధంగా మారింది. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక కథనం దీనికి తాజా ఉదాహరణ. 'ముస్లింలు రోజూ నమాజ్ చేసే బదులు స్నానం చేయాలి' అంటూ జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ అన్నట్లు, అతని ఫోటోతో పాటు ఓ ప్రముఖ పత్రిక పేరుతో ప్రచారం జరిగింది. ఆ కథనం చూసిన వారు ఎవరైనా 'ఇది నిజమే కావచ్చనే ఖచ్చితంగా నమ్మే అవకాశాలు అవకాశాలున్నాయి. ఎందుకంటే డిజైన్ కూడా పత్రికా శైలిలో, బలమైన శీర్షికతో, ఫోటో సరైన కోణంలో ఉంచబడి ఉంది. కానీ, నిశితంగా పరిశీలిస్తే, ఇది పూర్తిగా కల్పితం, దుష్ప్రచారం అని తెలుస్తుంది.

ఫేక్ న్యూస్ వెనుక రాజకీయ లక్ష్యం

ఇలాంటి కథనాలు యాదృచ్ఛికంగా రావు. వీటి వెనుక ఒక స్పష్టమైన వ్యూహం ఉంటుంది. ఈ వార్తను పరిశీలిస్తే రెండు లక్ష్యాలు మనకు కనిపిస్తాయి. 1. ముస్లిం సమాజాన్ని అవమానించడం, వారిపై దుష్ప్రచారం చేయడం. ప్రత్యర్థి పార్టీపై ప్రజలలో వ్యతిరేకత పెంచి, రాజకీయ ప్రయోజనం పొందడం. అందుకు ప్రముఖ పత్రిక పేరు వాడుకోవడం. ముస్లింలు రోజూ ప్రార్థనలు చేస్తారు. అది వారి మతపరమైన కర్తవ్యం. దాన్ని అవహేళనగా చూపడం ద్వారా ఒక వర్గంపై అసహనం పెంచడమే ఈ ప్రచారం ఉద్దేశం. అదే సమయంలో, 'ఇది కాంగ్రెస్ నాయకుడి భావజాలమా? ఇదా అతడి మనస్తత్వం?' అని ప్రజలు అనుకునేలా చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీని మైనారిటీలకు వ్యతిరేకంగా చూపే ప్రయత్నం కూడా కనిపిస్తోంది. ఫేక్ కటింగ్‌లో ప్రముఖ పత్రిక పదజాలం ఉపయోగించారు. అంటే ఇది ఆ పత్రికలో ప్రచురితమైన వార్తలా కనిపించేలా ప్రయత్నించారు. ఇది కేవలం తప్పుడు ప్రచారం మాత్రమే కాదు, ఇది న్యాయపరంగానూ తీవ్ర నేరం. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 468 (ఫోర్జరీ ఫర్ చీటింగ్), సెక్షన్ 153ఎ (మతాల మధ్య ద్వేషం పెంచడం) కింద ఇది శిక్షార్హం. ప్రధాన పత్రిక పేరు వాడటం ద్వారా ఒక పెద్ద మీడియా సంస్థను కూడా ఈ అబద్ధంలో భాగస్వామిగా చూపడం, దీంతో ప్రజలలో అపనమ్మకం కలిగించడం చాలా ప్రమాదకరం. అందుకే ఆ పత్రిక సంస్థ తక్షణమే స్పందించి, ఇది తమ వార్త కాదని, తప్పుడు ప్రచారం అని ప్రకటించాలి. అదే సమయంలో, ఫేక్ వార్తను సృష్టించి, ప్రచారం చేసిన వారి మీద న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి.

కాంగ్రెస్ పార్టీ మౌనంగా ఉండకూడదు

ఈ ఫేక్ వార్తలో కాంగ్రెస్ అభ్యర్థి పేరు, ఫోటో, పార్టీ చిహ్నం అన్నీ స్పష్టంగా చూపించారు. ఇలాంటి సందర్భంలో పార్టీ మౌనం వహిస్తే ప్రజలు దానిని 'మౌన అంగీకారం' గా భావించే ప్రమాదం ఉంది. కాంగ్రెస్ పార్టీ ఈ విషయంపై స్పష్టమైన ప్రకటన చేసి, సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలి. ఒక ఫేక్ ప్రచారం ద్వారా వ్యక్తి ప్రతిష్ఠను దెబ్బతీయడం, ఒక సమాజాన్ని అవమానించడం, ఇవి సామాన్యమైన విషయాలు కావు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీగాని, లేక ఆ అభ్యర్థిగాని స్పందించకుండా లైట్ తీసుకుంటే ఇవి కావాలని చేసిన వ్యాఖ్యలుగానే ప్రజలు పరిగణిస్తారు. ఇలాంటి ఫేక్ వార్తలు కేవలం తెలంగాణలోనే కాదు, దేశవ్యాప్తంగా ఒకే మాదిరిగా కనిపిస్తున్నాయి. ఏదో ఒక రాష్ట్రంలో ఏదో ఒక సంఘటనను ముస్లింలకు అన్వయించి, లేదా ఎవరో ముస్లిం నేత ఏదో వివాదాస్పద వ్యాఖ్య చేశారని ఫేక్ వీడియోలు, ఫేక్ కటింగ్స్ ద్వారా ప్రచారం చేస్తున్నారు. ముస్లింలకు ఎలాంటి సంబంధం లేని అనుమానాస్పద ఫేక్ ఆడియో, వీడియోలు సృష్టించి ముస్లింల పట్ల ద్వేషం పెంచడమే వీరి లక్ష్యం. ప్రజల మతపరమైన భావాలను రెచ్చగొట్టి, ఎన్నికల సమయంలో రాజకీయ ప్రయోజనం కోసం ఈ విధమైన హేట్ క్యాంపెయిన్‌లు నిర్వహించ బడుతున్నాయి.

విద్వేష రాజకీయాలు నడిపే పార్టీలు

ఈ వ్యూహం వెనుక సాధారణంగా విద్వేష రాజకీయాలు నడిపే పార్టీలు ఉంటాయి. బీజేపీ, దాని మిత్రపక్షాలు గతంలో ఎన్నోసార్లు ఇలాంటి ఫేక్ న్యూస్, మార్ఫిడి వీడియోలు, దుష్ప్రచార పోస్టులు ఉపయోగించినట్లు బయటపడ్డాయి. ఇప్పుడు కూడా అదే పద్ధతిని కొనసాగిస్తున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. భారతదేశంలో ఫేక్ న్యూస్‌ను నియంత్రించే చట్టాలు ఉన్నప్పటికీ, అవి అమలులో బలహీనంగా ఉన్నాయి. ఐటీ యాక్ట్ 2000లోని సెక్షన్ 66డి, ఐపీసీ153ఎ, 505(2) వంటి సెక్షన్లు మతాల మధ్య ద్వేషం పెంచే కంటెంట్‌పై చర్యలు తీసుకోవడానికి వీలు కల్పిస్తాయి. కానీ, సమస్య ఏమిటంటే, రాజకీయ ఒత్తిళ్లు, పోలీసుల నిర్లక్ష్యం, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల అలసత్వం వల్ల అనేక ఫేక్ వార్తలు దోషరహితంగా చలామణి అయిపోతున్నాయి. పత్రికలు, టెలివిజన్, ఆన్‌లైన్ మీడియా ఇవన్నీ ప్రజలకు సత్యాన్ని చెప్పాల్సిన, చూపించాల్సిన సంస్థలు. కానీ కొన్ని సందర్భాలలో ఈ సంస్థల మౌనం కూడా ఫేక్ న్యూస్ వ్యాప్తికి పరోక్షంగా తోడ్పడుతోంది. ప్రధాన సంస్థలు తమ పేరు, లోగోను దుర్వినియోగం చేసినప్పుడు కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి దుర్మార్గపు ప్రయత్నాలు తగ్గుముఖం పడతాయి.

ప్రజల పాత్ర - సత్యం తెలుసుకునే అలవాటు

ఫేక్ న్యూస్ వ్యాప్తి చెందడానికి కారణం రాజకీయ కుతంత్రాలు మాత్రమే కాదు, ఇందులో ప్రజల నిర్లక్ష్యం కూడా ఉంది. ఎవరో వాట్సాప్‌లో పంపిన వార్తను, సరిగా, వాస్తవాన్ని పరిశీలించకుండానే షేర్ చేయడం పెద్ద సమస్యగా మారింది. ప్రతి పౌరుడికి కనీసం సోర్స్ చెక్ చేయడం, అధికారిక ప్రకటన చూడడం, ఫాక్ట్ చెకింగ్ సైట్లు ఉపయోగించడం వంటి బాధ్యతలు ఉంటాయి. ఒక క్లిక్‌తో మనం సత్యాన్ని రక్షించగలం. భారతదేశం మత వైవిధ్యానికి నిలయంగా ఉంది. ఇక్కడ ముస్లింలు, హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, అందరూ దేశపౌరులే, ఈ దేశభక్తులే. ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని దూషించడం, వారి ఆచారాలను ఎగతాళి చేయడం ప్రజలమధ్య విభజనకు దారితీస్తుంది. అందుకే ఇలాంటి దుష్ప్రచారాలను తక్షణమే తిప్పికొట్టడం అత్యంత అవసరం. కాంగ్రెస్ అభ్యర్థి ఫోటోతో, ముస్లింలను అవమానించే విధంగా రూపొందించిన ఈ ఫేక్ న్యూస్ కేవలం ఒక ఫోటోషాప్ చేసిన చిత్రం కాదు. ఇది సమాజ విభజనకు, రాజకీయ లాభం కోసం సత్యాన్ని వక్రీకరించే ప్రయత్నం. ఇటువంటి అబద్ధాలను 'ఇది ఫేక్ న్యూస్' అని చెప్పి వదిలేస్తే సరిపోదు. బాధ్యులను గుర్తించి శిక్షించాలి. మీడియా సంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రజలు, అందరూ కలిసి సత్యానికి మద్దతు పలకాలి. వెంటనే కాంగ్రెస్ స్పందించి దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని శిక్షించాలి. సర్కులేషన్ లో ఉన్న తప్పుడు వార్తను తొలగించి, బాధ్యులతో క్షమాపణ చెప్పించాలి. తన పేరును ఇలా దుర్వినియోగం చేస్తున్నందుకు సదరు పత్రిక కూడా చట్టపర చర్యలు తీసుకోవాలి. స్వేచ్ఛ పేరుతో సోషల్ మీడియాలో ఇష్టమొచ్చిన నిందలు మోపడం, అశ్లీలం రాయడం, అభాండాలు వేయడాన్ని నిషేధించాలి. నిజం చెప్పడం ధైర్యం. అబద్ధం సృష్టించడం పిరికితనం. కానీ చివరికి గెలిచేది సత్యమే. సత్యమే వ జయతే!

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

జర్నలిస్టుల రక్షణ కనుమరుగు

ఒక్క పత్రికలు తప్ప ప్రపంచంలో ఏ వస్తువూ తయారీ ధరకంటే తక్కువకు లభ్యం కావటం లేదు. దీని అర్థం వాటి నిర్వాహకులు తనకు తగిన ఆదాయం, లాభాలు లేకుండా నడుపుతున్నారనా? టీవీ ఛానల్స్ కూడా అంతే. కొన్ని పార్టీలు, వాటి నేతలు, వ్యాపార సంస్థల వార్తలను ఇస్తే ఏదో మార్గంలో కాసులు కురుస్తాయి. కొన్నింటికి మాత్రమే ఎలాంటి ప్రతిఫలమూ వుండదు. అందుకే నేడు నూటికి తొంబై తొమ్మిది సంస్థలు తమకేమిటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. అలాంటి వాటికి భావ ప్రకటనా స్వేచ్ఛ వుంటేనే లేకపోతేనేం. నేడు మీడియా సంస్థలను డబ్బులు సంపాదించే పెట్టుబడి దారులు నడుపుతున్నారు తప్ప, సంపాదకులకు ఎలాంటి స్వేచ్ఛ లేకుండా పోతోంది

రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

ప్రజాస్వామ్యంలో నాలుగో 'స్థంభమైన మీడియా రంగానికి కష్టకాలం దాపురించింది. మీడియాకు స్వేచ్ఛ, జర్నలిస్టులకు రక్షణ ఎండ మావులే అవుతున్నాయి. గత కొన్నేళ్లలో ప్రపంచంలోని పలు దేశాలలో దాదాపు వెయ్యి మంది జర్నలిస్టులు విధి నిర్వహణలో హత్యకు గురయ్యారు. మన దేశంలోనూ హత్యలకు, చిత్రహింసలకు, దాడులకు గుర వుతున్న సంఘటనలు లేక పోలేదు. మే మూడున 'ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినం', నవంబరు రెండున 'జర్నలిస్టులపై నేరాలు చేసిన వారిని శిక్షించకుండా వదల వద్దని కోరే అంతర్జాతీయ దినం' నవంబరు 16న 'భారత పత్రికా దినం' ఇలా ఎన్ని దినోత్సవాలు జరిపినా పరిస్థితులలో మార్పు రాక పోవడం విచారకరం. జర్నలిస్టులకు రక్షణ చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. నవంబరు రెండు విషయానికి వస్తే 'అంతర్జాతీయ భావ ప్రకటనా స్వేచ్ఛ పరస్పర మార్పిడి' (ఇంటర్నేషనల్ ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ ఎక్స్ఛేంజ్ ఐఎఫ్ఇఎక్స్) అనే ఒక ప్రపంచ పౌర సంస్థల యంత్రాంగం యేటా ఈ రోజున 'జర్నలిస్టులపై నేరాలు చేసిన వారిని శిక్షించకుండా వదల వద్దని కోరే అంతర్జాతీయ దినం' జరపాలని 2011లో నిర్ణయించింది.

ఈ తేదీయే ఎందుకంటే

ఈ తేదీని ఎందుకు ఎంచుకున్నారంటే, 2009 నవంబరు 23న ఫిలిప్పీన్స్ లోని మాగుయిండానా ప్రాంత గవర్నర్ ఎన్నికలో ఒక అభ్యర్థి నామినేషన్ పత్రాలు దాఖలు చేసే కార్యక్రమంలో పాల్గొనేందుకు కొందరితో పాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు కూడా వెళ్లారు. వారి వాహన శ్రేణిపై విరుచుకు పడిన సాయుధ ముఠా, వారందరినీ అభ్యర్థి మద్దతుదారులుగా భావించి, కిడ్నాప్ చేసి కాల్చి చంపింది. ఈ దారుణ కాండలో 58 మంది మరణించగా వారిలో 34 మంది జర్నలిస్టులే వున్నారు. 2013లో ఐఎఫ్ఇఎక్స్ సభ్యులు, భావ ప్రకటనా స్వేచ్ఛను కోరుకొనే పౌరసమాజ కార్యకర్తల వినతి, పరిస్థితి తీవ్రత మేరకు 2013 డిసెంబరులో ఐక్యరాజ్య సమితి 70వ వార్షికోత్సవం సందర్భంగా జనరల్ అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. నవంబరు రెండున 'జర్నలిస్టులపై నేరాలు చేసిన వారిని శిక్షించకుండా వదలవద్దని కోరే అంతర్జాతీయ దినం' పాటించాలని నిర్ణయించింది. అదే సంవత్సరం నవంబరు రెండున మాలీ దేశంలో వార్తల సేకరణకు వెళ్లిన ఇద్దరు ఫ్రెంచి జర్నలిస్టులు ఘిస్‌లైన్ డ్యూపాంట్, క్లాడె వెర్లోన్‌ను హత్య చేశారు. అప్పటి నుంచి జర్నలిస్టుల మీద నేరాలు చేసిన వారెవరినీ వదల వద్దంటూ ఐఎఫ్ఇఎక్స్ సంస్థ ప్రతి యేటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది.

జర్నలిస్టుల కేసులను సమీక్షించాలని

యేటా ఈ రోజున ఐరాస సభ్య దేశాలు తమ దేశాలలోని జర్నలిస్టుల కేసులను సమీక్షించాలని, దోషులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని నివేదికలు ప్రకటించాలని యునెస్కో సభ్యదేశాలకు లేఖలు రాయటమే గాకుండా ప్రతి సంవత్సరం ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నది. స్వాతంత్ర్యానికి ముందు కూడా మీడియాలో రెండు తరగతులు వుండేవి. ఒకటి స్వాతంత్ర్య లక్ష్యం కోసం ప్రధానంగా పని చేసినవి, రెండవ తరగతి బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో ఘర్షణ పడకుండా స్వామికార్యం, స్వకార్యం నెరవేర్చు కొనేవి. తరువాత దేశ మీడియాలో ఆగీత చెరిగిపోయింది. ప్రజల కోసం, ప్రజల సమస్యల మీద కేంద్రీకరణ లేదు. ఎవరు అధికారంలో వుంటే వారి భజనచేస్తూ లాభార్జనే ప్రధాన వ్యాపకంగా మారింది. అందుకోసం వార్తను, దృశ్యాన్ని వ్యాపార సరకులుగా మార్చి వేశారు. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటిష్ వారిని వ్యతిరేకిస్తూ పత్రికలు పెట్టిన ఎందరో తమ ఆస్తులను ఫణంగా పెట్టారు. ప్రస్తుతం అధిక సంఖ్యాక పత్రికలు,చానళ్లు లాభాల కోసం నడుస్తున్నవే. మా పత్రిక ధర మీరు కొనే సమోసా కంటే తక్కువే అని గతంలో ఒక మీడియా సంస్థ ప్రచారం చేసుకుంది. ఇప్పటికీ పత్రికలు సమోసా కంటే తక్కువ ధరలకే లభిస్తున్నాయి.

ఆదాయం, లాభాలు లేకుండా

ఒక్క పత్రికలు తప్ప ప్రపంచంలో ఏ వస్తువూ తయారీ ధరకంటే తక్కువకు లభ్యం కావటం లేదు. దీని అర్థం వాటి నిర్వాహకులు తనకు తగిన ఆదాయం, లాభాలు లేకుండా నడుపుతున్నారనా? టీవీ ఛానల్స్ కూడా అంతే. కొన్ని పార్టీలు, వాటి నేతలు, వ్యాపార సంస్థల వార్తలను ఇస్తే ఏదో మార్గంలో కాసులు కురుస్తాయి. కొన్నింటికి మాత్రమే ఎలాంటి ప్రతిఫలమూ వుండదు. అందుకే నేడు నూటికి తొంబై తొమ్మిది సంస్థలు తమకేమిటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. అలాంటి వాటికి భావ ప్రకటనా స్వేచ్ఛ వుంటేనే లేకపోతేనేం. నేడు మీడియా సంస్థలను డబ్బులు సంపాదించే పెట్టుబడి దారులు నడుపుతున్నారు తప్ప, సంపాదకులకు ఎలాంటి స్వేచ్ఛ లేకుండా పోతోంది. సంపాదన, అధికారం ధ్యేయాలైన మీడియా నిర్వాహకులు వార్తలను అమ్ము కోవటానికి ఏమాత్రం వెనకాడటం లేదు. ఈ కారణంగానే గతంలో, ప్రస్తుతం ఎవరు అధికారంలో వున్నా మీడియాను పూర్తిగా తమ చెప్పుచేతలలో తీసుకొనేందుకు ప్రయత్నిచడం కొనసాగుతున్నది. లొంగని వాటి ఆర్థిక మూలాలను దెబ్బ తీసేందుకు, తద్వారా వాటి మూతకు ప్రయతాలు జరుగడం నిత్య కృత్యమే. మీడియా స్వేచ్ఛకు కలుగుతున్న హాని గురించి ఒక్క మాట కూడా రాయలేని నిస్సహాయ సంపాదకులను నేడు మనం చూస్తున్నాం.

(నేడు జర్నలిస్టులపై నేరాలు చేసిన వారిని శిక్షించకుండా వదల వద్దని కోరే అంతర్జాతీయ దినం)

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

ప్రాంతీయం

రూ. 300 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

- మణికొండ మున్సిపాలిటీలో..
- ప్రభుత్వ భూమితో పాటు.. పార్కులకు కబ్జాల నుంచి విముక్తి

ప్రతిపక్షం, సిటీబ్యూరో, నవంబర్ 1: మణికొండ మున్సిపాలిటీలో దశాబ్దాలుగా కబ్జాల చెరలో చిక్కుకుపోయిన ప్రభుత్వ భూమితో పాటు పార్కులకు శనివారం హైడ్రా విముక్తి కల్పించింది. దాదాపు రూ. 300ల కోట్ల విలువైన భూమిని కాపాడింది. ఇందులో ఒక ఎకరం ప్రభుత్వ భూమి కాగా.. 7650 గజాల పార్కు స్థలాలున్నాయి. వీటికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మణికొండలోని పంచవటి కాలనీలో వెస్టర్న్ ప్లాజాకు చేరువలో ఉన్న 1 ఎకరా భూమికి ఎలాంటి పత్రాలు లేకుండా తమ పూర్వీకులదని చెప్పి కబ్జా చేసిన వారిని హైడ్రా శనివారం ఖాళీ చేయించింది. ప్రభుత్వ భూమిలో కబ్జాదారులు తిష్ట వేసారంటూ వెస్టర్న్ ప్లాజాకు చెందిన వారు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో హైడ్రా అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో పరిశీలించి ప్రభుత్వ భూమి అని నిర్ధారించుకున్నారు. శనివారం ఆక్రమణలను తొలగించి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులను ఏర్పాటు చేశారు. దీని విలువ దాదాపు రూ. 155 లక్షలు ఉంటుందని స్థానిక అధికారులు అంచనా వేశారు.

రెండు పార్కులకు విముక్తి...
మణికొండ మున్సిపాలిటీలోనే వెంకటేశ్వర కాలనీలో 1600 ల గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. 1992లో లే ఔట్ వేసినప్పుడు పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించి కేటాయించిన ఈ స్థలంలో అనుమతి లేని లే ఔట్‌తో కొంతమంది ఆక్రమణలకు పాల్పడ్డారు. పార్కు స్థలంలో బై నంబర్లు వేసుకుని కబ్జాలు చేశారంటూ హైడ్రా ప్రజావాణికి వెంకటేశ్వర కాలనీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు విచారణ చేయగా.. నెక్నాంపూర్ గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు 1996లోనే పార్కు, ప్రజావసరాల స్థలాన్ని గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చినట్టు తేలింది. అయితే తర్వాత మున్సిపాలిటీ అయ్యాక 2019లో ఈ స్థలాలకు అనుమతులు ఇచ్చినట్టు స్థానికులు హైడ్రాకు తెలిపారు. ఇలా పలు వివాదాల్లో ఉన్న 1600ల గజాల స్థలాన్ని స్వాధీనం చేసుకుని పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. దీని విలువ రూ. 25 కోట్లు ఉంటుందని అంచనా. ఇదే మున్సిపాలిటీలోని తిరుమల హిల్స్‌లో 6150 గజాల పార్కు స్థలం కూడా కబ్జాలకు గురైంది. ఇందులో తాత్కాలికంగా వేసిన షెడ్డులు, కాంపౌండ్ వాల్‌ను తొలగించి హైడ్రా ఫెన్సింగ్ వేసింది. అలాగే పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులను ఏర్పాటు చేశారు. మార్కెట్లో ఈ భూమి విలువ రూ. 120 కోట్లు వరకూ ఉంటుందని స్థానిక అధికారులు చెబుతున్నారు.

రోజువారి జీవితంలో క్రీడలు భాగం కావాలి

- ఎన్టీఆర్ విద్యాసంస్థల చైర్మన్ నారా భువనేశ్వరీ

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 1: రోజువారి జీవితంలో క్రీడలు భాగం కావాలని ఎన్టీఆర్ విద్యాసంస్థల చైర్మన్ నారా భువనేశ్వరీ అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లో గల ఎన్టీఆర్ విద్య సంస్థల్లో నిర్వహిస్తున్న మూడు రోజుల క్రీడోత్సవాలు శనివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల చైర్మన్ నారా భువనేశ్వరి, సీఈవో రాజేంద్ర కుమార్, సిఓఓ గోపిలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కాగడతో క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఆటల్లో గెలుపోటములు సహజమని ఓడిన వారు కుంగిపోకుండా మళ్లీ గెలుపు కోసం ప్రయత్నం చేయాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈఓ రాజేంద్ర కుమార్, సిఓఓ గోపి, ఎన్టీఆర్ విద్యాసంస్థల డీన్ రామారావు, ప్రిన్సిపల్ ఎస్ జె రెడ్డి, డైరెక్టర్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ నర్సింలు, ఏవో సురేష్, అధ్యాపకులు వివిధ కళాశాలల చైర్మన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెహ్రూపై మోడీ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

- రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 1: స్వాతంత్ర్య ఉద్యమం గురించి తెలవని ప్రధాని నరేంద్ర మోడీ మన దేశ తొలి ప్రధాని నెహ్రూను అవమానించేలా మాట్లాడడం మోడీ దుర్నీతికి నిదర్శనమని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు.పాక్ ఆక్రమిత కశ్మీర్ గురించి మాట్లాడుతున్న ప్రధాన మంత్రి చరిత్ర తెలుసుకోవాలన్నారు. హైదరాబాద్ నిజాం నవాబు పాకిస్తాన్ లో కలవాలని కోరుకున్నారన్న విషయం మోడీకి తెలియదన్నారు. ప్రజలు భారతదేశంలో విలీనం కావాలని కోరుకున్నారన్నారు. జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలో ఆనాటి రాజు హరిసింగ్ భారతదేశంలో విలీనం కావాలనుకున్నారని మంత్రి తెలిపారు. ఇది చరిత్ర అని తెలిపారు. నెహ్రూ ఆలోచన మేరకు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ ఈ రెండు అంశాలు పరిశీలించారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో లేకుండా, భారత దేశ నిర్మాణానికి ఉపయోగపడని వారు నెహ్రూను విమర్శించేందుకు దిగజారి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. అహింసా పద్ధతిలో స్వాతంత్రం సాధించిన గాంధీజీ పట్ల, ఉక్కు మహిళ ఇందిరాగాంధీ పట్ల విద్వేషంతో మాట్లాడుతున్నారంటూ విమర్శించారు. మోడీ ఇలా అవమానపరిచే విధంగా మాట్లాడితే భారత దేశ ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. ఇలాంటి వారిని చరిత్ర క్షమించదని, చరిత్రలో హీనులుగా మారకుండా ఉండాలంటే ఇలాంటి వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని మంత్రి డిమాండ్ చేశారు.

రైతులకు పరిహారం ఇప్పించడంలో

ఎమ్మెల్యే చొరవ చూపాలి

- బసవపురం అంజయ్య గౌడ్

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 1 : రైతులకు పంట నష్టం ఇప్పించడంలో ఎమ్మెల్యే చొరవ చూపాలని మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బసవపురం అంజయ్య గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 24 గంటలుగా మంథా తుఫాన్ ప్రభావంతో ఏర్పడిన పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులకి నష్ట పరిహారం అందేలా ఎమ్మెల్యే చొరవ చూపాలన్నారు. అదే విధంగా గ్రామాలలో బీఆర్ఎస్ శ్రేణులు చొరవ చూపి అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలి కోరారు.

జాతీయ రహదారిపై సీపీఎం ధర్నా

- రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని డిమాండ్

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 1: రోడ్డపై ఏర్పడ్డ గుంతలను త్వరగా పూడ్చి ప్రమాదాలను అరి కట్టాలని సీపీఎం మేడ్చల్ మండల ప్రధాన కార్యదర్శి నరేష్ అన్నారు. ఫ్లై ఓవర్ పనులు ప్రారంభం అయినప్పటినుండి మేడ్చల్ జాతీయ రహదారి 44పై భారీగా గుంతలు ఏర్పడడంతో ఎంతోమంది ప్రమాదాలకు గురై మృతి చెందారని సిపిఐఎం పార్టీ మేడ్చల్ మండల ప్రధాన కార్యదర్శి నరేష్ ఆరోపించారు. శనివారం మేడ్చల్ మండలం సిపిఐఎం నాయకులు జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలలో కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి విస్తరణ పనుల ఆలస్యంతో రోడ్డుపై అతలాకుతల పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. జాతీయ రహదారి విస్తరణ పనుల కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే ఎంతోమంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబ సభ్యులకు తీరని నష్టం మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నపలంగా అధికారులు స్పందించి జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. హైవే విస్తరణ పనుల కాంట్రాక్టర్ పై పోలీసులు సుమోటోగా క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఫ్లై ఓవర్ పనులు ప్రారంభమైనప్పటినుండి సుమారు 20 మంది ప్రజలు ప్రమాదాలను మృతి చెందారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఫ్లైఓవర్ విస్తరణ పనులను పూర్తిచేయాలని సిపిఐఎం మేడ్చల్ మండల నాయకులు కోరారు.

మత్స్యకారులందరు సంతోషంగా ఉండాలి

- ఎంపీ ఈటల రాజేందర్

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 1: మత్స్యకారులందరు సుఖ సంతోషాలతో ఉండాలని మేడ్చల్ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ జిల్లా శామీర్పేట చెరువులో శనివారం ఎంపీ ఈటల రాజేందర్ చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో చెరువులు మీద ప్రాజెక్టుల మీద ఆధారపడే ఇన్లాండ్ ఫిషరీస్ మాత్రమే అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అదృష్టం కొద్దీ ప్రాజెక్టులు వాగులు చెరువుల రూపంలో పెద్ద ఎత్తున జల సంపద మనకు ఉందని తెలిపారు. తెలంగాణలో 40 లక్షల మత్స్యకారుల జనాభా ఉందని, అందరూ చేపల పెంపకం మీదనే ఆధారపడి ఉన్నారన్నారు. వీరంతా గ్రామాలలో ఉండి చెరువులను నమ్ముకుని జీవిస్తున్నారని, తెలంగాణ వచ్చిన తర్వాత సైకిల్ మోటార్ల పంపిణీ, ఆటోల పంపిణీ, ఐస్ ఫ్యాక్టరీల నిర్మాణం, ట్రాన్స్పోర్ట్ కోసం సపోర్టు, ఉచిత చేప పిల్లలు పంపిణీ మొదలు పెట్టారన్నారు. ప్రజలకు ఉపయోగపడే స్కీములు ఏ ప్రభుత్వం వచ్చినా కొనసాగించాల్సిన బాధ్యత ఉంటుందని తెలిపారు. హైదరాబాద్ సిటీ ఆఫ్ లేక్. కానీ చెరువులలో డ్రైనేజీ నీళ్లు చేరి చేపలు చచ్చిపోతున్నాయన్నారు. మూసి నీళ్ల వల్ల ఏదులాబాద్ చెరువులో చేపలు చచ్చిపోతున్నాయని బాధ పడ్డారు. మేడ్చల్ జిల్లాలో 87 సొసైటీలు ఉన్నాయని, శామీర్పేట్ గొప్ప చెరువు ఏడు లక్షల చేప పిల్లలను ఈరోజు వదలడంతో సంతోషం వ్యక్తం చేశారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం నా వంతు సహకారం అందిస్తామని మాట ఇస్తున్నానని తెలిపారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా మనుషలకు చేపలు ప్రోటీన్ అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఇతర ప్రజా ప్రతినిధులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నేడు మేడ్చల్ పారిశ్రామికవాడలో

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 1: విద్యుత్ ఉపకేంద్రాల మరమ్మతుల పనుల కారణంగా నేడు మేడ్చల్ పారిశ్రామికవాడలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మేడ్చల్ టౌన్ ఏఈ రాంబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వైర్లకు అడ్డు వస్తున్న చెట్ల కొమ్మలను తొలగించడానికి మేడ్చల్ ఉపకేంద్రంలోని 33/13కేవి పరిధిలోని మేడ్చల్ పారిశ్రామికవాడలో ఉదయం 10 గం.నుండి మధ్యాహ్నం 2 గంటలవరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులందరు సహకరించాలని కోరారు

సబ్ స్టేషన్ పనులను సందర్శించిన ఎస్ఈ

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 1: భవిష్యత్ విద్యుత్ అవసరాలకోసం రానున్న వేసవికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలను అందిస్తామని మేడ్చల్ విద్యుత్ సుపరీటెండెంట్ ఇంజనీర్ రవికుమార్ అన్నారు. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కెవిఎల్ఆర్ వెంచర్లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న 33/11కెవి సబ్ స్టేషన్ పనులను శనివారం సందర్శించారు. అనంతరం క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ స్టేషన్ నిర్వహించడంతో ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ జాన్ పోతురాజు, డీఈ టెక్నికల్ శ్రీనాథ్ రెడ్డి, ఏడీఈ రాజమల్లేష్, ఏడీఈ కాంస్ట్రక్షన్ అరుణ, ఏఈ రాంబాబుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మాగంటి సునీత గెలుపుకోసం నకిరేకల్ నియోజకవర్గం నుండి జూబ్లీహిల్స్ వరకు సైకిల్ యాత్ర చేస్తున్న ఏసయ్య ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, బీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు రజితా రెడ్డి ఉన్నారు.
ప్రతిపక్షం సిటీ బ్యూరో

నిజాయతీ అందరి జీవన విధానం కావాలి

- అందరిలో చైతన్యంతోనే అవినీతికి అడ్డుకట్ట
- బీహెచ్ఈఎల్ విజిలెన్స్ వార్షికోత్సవంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్

ప్రతిపక్షం, సిటీబ్యూరో, నవంబర్ 1: వ్యవస్థల పట్ల, వాటి పని తీరుతో పాటు పౌరుల హక్కులకు సంబంధించి అందరిలోనూ అవగాహన ఉన్నప్పుడు అవినీతి నిర్మూలన సాధ్యమౌతుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. చట్టాలపైన అవగాహన కల్పించడంతో పాటు.. అనుసరించాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత వాటిని అమలు చేసేవారిపై ఉందన్నారు. గొలుసు కట్టు చెరువుల ప్రాధాన్యత, నాలాల అవశ్యకత, ప్రజావసరాలకు ఉద్దేశించిన భూముల పరిరక్షణ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలందరికీ తెలిసేలా హైడ్రా చర్యలు తీసుకుందన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా బీహెచ్ఈఎల్ నిర్వహించిన కార్యక్రమంలో ఏవీ రంగనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైడ్రా రాక ముందు చెరువు ఎఫ్ టి ఎల్, బఫర్ పట్ల చాలా మందిలో అవగాహన లేదని.. ఇప్పుడు దాదాపుగా అందరికీ తెలిసేలా చేశామన్నారు. ఇటీవల హైడ్రా వార్షికోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన

ప్రదర్శనలో పాఠశాల విద్యార్థులు చెరువుల ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్) బఫర్, నాలాల బఫర్‌ను కాపాడాల్సిన అవసరాన్ని కళ్లకు కట్టారన్నారు. ఇప్పుడు చెరువుల చెంత, నాలాల పక్కన ఇంటి స్థలం కొనేవారు పైన పేర్కొన్న లెక్కలన్నీ సరి చూసుకుని కొంటున్నారని హైడ్రా కమిషనర్ తెలిపారు. నగర భవిష్యత్తుకు హైడ్రా చేస్తున్న కృషికి ప్రజలందరి సహకారం లభిస్తుందంటే.. వాటి ఆవశ్యకతను తెలుసుకోవడంతోనే సాధ్యమైందని చెప్పారు. ఏడాదిలో దాదాపు వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమని హైడ్రా కాపాడిందని అన్నారు. ఎన్ ఆర్ ఎస్ సీ (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్) తెలిపిన వివరాల ప్రకారం నగరంలో 61 శాతం చెరువులు కనుమరుగయ్యాయయని.. ఇదే కొనసాగితే వచ్చే 15 ఏళ్లలో మొత్తం చెరువులు మాయం అవుతాయని హెచ్చరించారు. అందుకే చెరువులతో పాటు నాలాల పరిరక్షణకు హైడ్రా నడుం బిగించిందన్నారు. మొదటి విడతగా 6 చెరువులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. చెరువులు, నాలాలు ఆక్రమణలకు గురికాకపోతే వరదలను నియంత్రించగలమని చెప్పారు. ఇలా హైడ్రా చేస్తున్న ప్రతీ చర్యా.. పారదర్శకంగా ఉంటుందని పేర్కొన్నారు. విజిలెన్స్ వారోత్సవాలను పాఠశాలల్లో నిర్వహించామని బీహెచ్ ఈ ఎల్ హైదరాబాద్ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేబీ రాజా తెలిపారు. విద్యార్థి దశలోనే అవగాహన తీసుకు వస్తే మంచి పౌరులుగా మారుతారన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన ఉద్యోగులతో పాటు.. విద్యార్థులకు అవార్డులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీహెచ్ ఈ ఎల్ వార్షికోత్సవంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్యాంకర్ ఢీకొట్టడంతో చికిత్స పొందుతూ ఏఎస్ఐ మృతి

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 1: వాటర్ ట్యాంకర్ ఢీకొట్టడంతో గాయలపాలైన ఏఎస్ఐ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో శనివారం ఉదయం పరేడ్ ను నిర్వహించారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న దేవిసింగ్ (60) రోడ్డు పక్కన వాకింగ్ చేస్తుండగా పక్కనుండి వెళ్తున్న వాటర్ ట్యాంకర్ వెనుక భాగంతో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దేవీసింగ్ కు బలమైన గాయ్యాలయ్యాయి. సంఘటనను చూసిన పోలీసులు దేవిసింగ్ ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దేవిసింగ్ శనివారం సాయంత్రం మృతి చెందారు.

మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం మార్చురికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

2023లో వరుణ్ తేజ్,-లావణ్య త్రిపాఠి వివాహ సమయంలో నితిన్, శాలిని కందుకూరి ఇచ్చిన పార్టీలో నయనికను కలుసుకున్నా. అలా ప్రేమ మొదలవ్వగా సరిగ్గా రెండేళ్లకు ఆమెను ఎంగేజ్మెంట్ చేసుకున్నా. భవిష్యత్తులో నా పిల్లలు మా కథ ఎలా ప్రారంభమైందని అడిగితే 'ఇలానే మీ అమ్మను కలిశా' అని చెబుతా"..
- అల్లు శిరీష్, టాలీవుడ్‌హీరో

ప్రాంతీయం

అధైర్య పడవద్దు.. అందరినీ ఆదుకుంటాం

- వరద బాధితులకు మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, నవంబర్ 1: వరద బాధితుల ను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎవరు అధైర్య పడవద్దని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 29వ తేదీన జిల్లాలో కురిసిన వర్షానికి నష్టపోయిన ప్రతి ఒక్కరిని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిం దన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో అతి భారీ వర్షం కురిసి అపార ప్రాణ, ఆస్తి నష్టం కలిగించిందన్నారు. వరి, ఇతర పంటలతో పాటు హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో 90 మెట్రిక్ టన్నుల వరి వరి ధాన్యం పూర్తిగా కొట్టుకు పోయిందన్నారు. వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం అకాల వర్షానికి తడిచి రైతులకు తీరని నష్టం కలిగిందని అన్నారు. ఈ నష్టంపై వెంటనే స్పందించి స్వయంగా తనతో పాటు జిల్లా కలెక్టర్ కె.హైమావతి హుస్నాబాద్ నియోజ కవర్గ పరిధిలోని పంటలు, కొనుగోలు కేంద్రాలతో పాటు హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. నష్ట పోయిన రైతులను ఆదు కునేందుకు తక్షణ చర్యలు చేపట్టామన్నారు. అక్కన్నపేట మండలం మోత్కులపల్లి వద్ద వరదల్లో గల్లంతై చనిపోయిన ముగ్గురి కుటుంబాలను, అధిక వర్షాలతో మృత్యువాత పడ్డ ఎనిమిది పశువుల యజమానులను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరద నష్టంపై సమీక్ష సమావేశం నిర్వహించారని చెప్పారు. హుస్నాబాద్ పట్టణంలో ప్రధాన రహదారితో పాటు వివిధ కాలనీలలో ప్రజలు వరద నీటితో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఇలాంటి ఇబ్బందులు భవిష్యత్తులో తలెత్తకుం డా హుస్నాబాద్ పట్టణంలో మురుగునీరు, వరదనీరు డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల నిర్మాణానికి రూ.80 కోట్లతో డీపీఆర్ రూపొందించామని అన్నారు. సిద్దిపేట జిల్లా వ్యా ప్తంగా అధిక వర్షాలతో 4,844 ఎకరాల్లో వరి వరి పంట దెబ్బ తినడంతో 3,491 మంది రైతులు నష్టపోయారని చెప్పారు. 588 ఎకరాల్లో పత్తి పంట పాడవడంతో 393 రైతులకు నష్టం జరిగిందన్నారు. 51 ఎకరాల్లో మొక్కజొన్న పంట నీట మునిగి 32 మంది రైతులకు నష్టం కలిగిందని వి వరించారు. వాటిలో హుస్నాబాద్ నియోజకవర్గం పరిధిలో 2,565 మంది రైతులకు చెందిన 3,454 ఎకరాల వరి, 24 మంది రైతులకు చెందిన 37 ఎకరాల మొక్కజొన్న, 290 మంది రైతులకు చెందిన 454 ఎకరాల పత్తిపంటకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారని తెలిపారు. ఎకరానికి రూ.పదివేల నష్టపరిహారం చెల్లిస్తామని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని అన్నారు. హుస్నాబాద్ మార్కెట్ యార్డులో తడిసిన 230 మెట్రిక్ టన్నులకు పైగా వరి ధాన్యాన్ని మద్దతు ధరతో సేకరించి రైస్ మిల్లులకు తరలించినట్లు తెలిపారు.

హరీష్ రావును పరామర్శించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 1: మాజీ మంత్రి, సిద్ది పేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావును ఎమ్మా ర్పీఎస్ నాయకులు పరామర్శించారు. హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు పరమపదించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా హైదరాబాదులో ని హరీష్ రావు నివాసానికి చేరుకున్న ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయన కుటుంబ సభ్యులను పరామ ర్శించి, సంతాపం తెలిపారు. సత్యనారాయణ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్, సీనియర్ జాతీయ నాయకులు, సామాజిక ఉద్యమకారులు పెద్దమాతరి బాబు మాదిగ, సుంకరి యాదగిరి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి నేతల పరామర్శ

ప్రతిపక్షం, దౌల్తాబాద్, నవంబర్ 1: మాజీ మంత్రి, సిద్ది పేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు తండ్రి సత్యనారాయణ రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి బీఆర్ఎస్ నాయకులు హరీష్ రావును పరామర్శించా రు. అనంతరం సత్యనారాయణ చిత్రపటానికి పూలమా లవేసి నివాళులర్పించారు. సీనియర్ జర్నలిస్ట్ బీఆర్ఎ స్ నాయకులు నాయిని రాజగోపాల్, నాయకులు తి రుమలరెడ్డి, ఆనందరెడ్డి, దేవగారి శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, నవంబర్ 1: ప్రభుత్వ ఆసుప త్రిలో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా నర్సింగ్ విద్యార్థులు శిక్షణ పొందాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి సూచించారు. సిద్దిపేట పట్టణం లోని అంబేద్కర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్ సీలో శిక్షణ పొందుతున్న నర్సింగ్ కళాశాల విద్యార్థులతో మాట్లా డారు. నర్సింగ్ కళాశాలలో నిర్దేశించిన అకడమిక్ మూ ల్యాంకనం ప్రకారం శిక్షణ తీసుకోవాలని సూచించారు. హాజరు, ఓ పి రిజిస్టర్లను పరిశీలించారు. క్షేత్ర అధికారు లు ప్రతి రోజు హాజరు రిజిస్టర్లో సంతకం పెట్టిన తరువాత క్షేత్ర పర్యటనకు వెళ్లాలని వైద్యాధికారిని ఆదేశించారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది, మౌలిక వసతుల కొరత ఉంటే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని సంప్రదిం చాలని సూచించారు. సమయ వేళలు పాటించాలని వైద్య పరికరాలు అందుబాటులో ఉంచుకుని ప్రజలకు ఓపికగా వైద్యం చేయాలని చెప్పారు. విధులు సక్రమం గా నిర్వహించాలని లేనిచో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రత్యేక ఫీడర్‌ను ఏర్పాటు చేస్తాం

- లో ఓల్టేజీ సమస్యను పరిష్కరిస్తాం
- పొన్నాల, సంతోష్‌నగర్‌లో విద్యుత్ అధికారుల ప్రజా బాట

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 1: లో ఓల్టేజీ సమస్య ఉత్పన్నం కాకుండా అవసరమైన చోట ట్రాన్స్‌ఫా ర్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక ఫీడర్‌ను ఏర్పాటు చేస్తామని విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రమో హన్ అన్నారు. ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా శనివారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల పరిధి లోని సంతోష్‌నగర్‌లో పర్యటించి స్థానికులతో మాట్లాడి విద్యుత్ సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో చాలా కాలంగా లో ఓల్టేజీ సమస్య ఉందని, ప్రత్యేక ఫీడర్‌ను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరగా ప్రత్యేక ఫీడర్‌తో పాటు లో ఓల్టేజీ సమస్య పరిష్కారం కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని కాలనీ వాసులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో ఏఎస్‌వో హన్మంత రావు, డీఈలు రాంచంద్రయ్య, పండరి, ఏడీఈ శ్రీని వాసులు, ఏఈ శ్రీధర్‌రెడ్డి, లైన్‌మెన్ పర్శరాములు, కాలనీ వాసులు బాల్‌రెడ్డి, నర్సింహాచారి తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు టీఆర్పీ సిద్ధం

- జిల్లా టీఆర్పీ అధ్యక్షుడు బిక్షపతి

ప్రతిపక్షం, గజ్వేల్ (మర్కుక్), నవంబర్ 1: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీలు ఏకమైతే బీసీల రాజ్యాధికార బాట సాధ్యమవుతుందని సిద్దిపేట జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు తుప్పతి బిక్షపతి అన్నారు. శనివారం మర్కుక్ మండల కేంద్రంలో బిక్షపతి మాట్లాడుతూ, తీన్మార్ మల్లన్న ఏర్పాటుచేసిన టీఆర్పీ పార్టీకి రాష్ట్రంలో అన్ని వర్గాల నుండి మద్దతు లభిస్తుందని, కాంగ్రెస్, టిఆర్ఎస్, బిజెపి పరిపాలన చూసి ప్రజలు విసుగెత్తిపోయారని, టిఆర్పిలోకి వలసలు వివిధ పార్టీల నుంచి వస్తున్నాయ ని సిద్దిపేట జిల్లాలో టీఆర్పీ పార్టీ బలోపేతం అవుతుం దని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

హరీశ్ రావును పరామర్శించిన మున్సిపల్ పాలకవర్గం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 1: మాజీ మంత్రి, సిద్దిపేట శాసన సభ్యులు తన్నీరు హరీశ్ రావును తండ్రి మృతి చెందిన నేపథ్యంలో శనివారం హైదరాబాద్ కోకా పేటలోని క్రిన్స్ విల్లాస్ లో వారి నివాసానికి వెళ్లి సత్యనారా యణ చిత్రపటానికి సిద్దిపేట మున్సిపల్ చైర్పర్సన్ శ్రీమతి కడవేరుగు మంజుల రాజనర్సు, సిద్దిపేట పాలకవర్గం మహిళ కౌన్సిలర్లు పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. హరీశ్ రావు, వారి కుటుంబ సభ్యులను పరామ ర్శించారు. పరామర్శించిన వారిలో.. కౌన్సిలర్లు వంగ రేణుక తిరుమల్ రెడ్డి, గోపాలపురం దీప్తి నాగరాజు, వరాల కవిత సురేష్, బింగి బాల్ లక్ష్మి రాజేశం మాజీ కౌన్సిలర్ నాయకం పుష్పలత లక్ష్మణ్, దాసరి భాగ్యలక్ష్మి శ్రీనివాస్ యాదవ్, అడ్డగట్ల కావేరి అంజి, ఫాతిమా బేగం వజీర్, బందారం శ్రీలత రాజు, తస్లీమ్ బేగం మొయిజ్, గుడాల సంధ్య శ్రీకాంత్, భూంపల్లి శ్రీలత శ్రీహరి, కాటం శోభరాణి రఘురామ్ ఉన్నారు.

మిల్లర్లు ధాన్యానికి ట్యాగింగ్ చేయాలి

- జిల్లా కలెక్టర్ కె.హైమావతి

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 1: తూకం వేసి మిల్లు లకు పంపిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లు ట్యాగింగ్ చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి డీసీఎస్ వోను ఆదేశించారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి, నంగునూరు మండలం ముండ్రాయి గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం జిల్లా కలెక్టర్ కె.హైమావతి సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీ లించారు. ఈ సందర్భంగా మిట్టపల్లి కొనుగోలు కేంద్రం సిబ్బంది మాట్లాడుతూ ఇప్పటి వరకు 1106 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి మూడు లారీల్లో గాడిచర్ల పల్లి లోని రైస్ మిల్లుకు పంపించామని కలెక్టర్ కు చెప్పారు. మిల్లర్ ట్యాగింగ్ జెనరేట్ చేస్తే డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. స్పందించిన కలెక్టర్ మిల్లర్ ట్యాగింగ్ ప్రక్రియ పూర్తి చేసే చర్యలు తీసుకోవాలని డీ సీ ఎస్ ఓ కు ఫోన్ చేసి ఆదేశించారు. తేమ శాతం వచ్చే వరకు కేంద్రంలో ఆరబోసే రైతులు సాయంత్రం కుప్పలు చేసుకుని టార్పాలిన్ కవర్లు కప్పుకోవాలని చెప్పారు. దీని వల్ల వర్షాలకు ధాన్యం తడవకుండా ఉంటుందని చెప్పారు. తేమ శాతం వచ్చే వరకు రైతులు వ్యవసాయ క్షేత్రాల వద్ద కల్లాలలో ఆరబోయడం మంచిదని రైతులకు సూచించారు. శనివారం 12 మంది రైతుల ధాన్యం తేమ వచ్చిందని తెలిపారు. గోనె సంచులలో నింపి రాత్రి వరకు లోడ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా తేమ శాతం చెక్ చేశారు. సాయంత్రం వరకు ఆరబోస్తే తేమ శాతం వస్తుందని వెంటనే క్లీనింగ్ చెయ్యాలని రైతుకి సూచించారు. అనంతరం ముండ్రాయి గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.

ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ మోసం చేసింది

- మాజీ ఎమ్మెల్యే పద్మదేవేందర్ రెడ్డి
- జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారం



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 1: ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌ను భారీ మెజార్టీతో గెలిపించ డమే లక్ష్యంగా పద్మా దేవేందర్ రెడ్డి, పార్టీ ప్రజా ప్రతినిధు లు, శ్రేణులతో కలసి ప్రచార నిర్వహించారు. శనివారం ఎర్రగడ్డ డివిజన్ లోని సుల్తాన్ నగర్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలకు నెలకు 2500 ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. అనంతరం పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, గాలికి వదిలేసిన హామీలను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ ను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో స్థానిక నాయకులతో పాటు మెదక్ నాయకులు అహ్మద్, లింగారెడ్డి, జుబేర్ అహ్మద్, కుమార్ యాదవ్, రాజ్ కుమార్, నరేష్, రంజిత్, లడ్డు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే రోహిత్ జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 1:- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిం చడం జరిగిందని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ తొడుపు నూరి చంద్రపాల్ కొనియాడారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో కేక్‌కట్ చేశారు. అనంతరం మెదక్ వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, మహాదేవాలయమైన చర్చి, పిట్లం బేస్ దర్గా లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చంద్రపాల్ మాట్లాడుతూ దేశంలోనే అతిచి న్న వయసులోనే ఎమ్మెల్యే గా గెలుపొందిన న గొప్ప లీడర్ డాక్టర్ మైనంపల్లి రోహిత్ అని తెలిపారు. ఎమ్మెల్యే మెదక్ ను అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారని అయన పేర్కొన్నారు. మెదక్ అభివృద్ధి విషయంలో ఏలాంటి రాజీ లేకుండా పక్కా ప్రణాళిక తో ఎమ్మెల్యే ముదుకెళ్తున్నారని తెలిపారు. ఎమ్మె ల్యే ఆయురారోగ్యాలతో ఉండి మెదక్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ఆకాంక్షిస్తూన్నట్లు తెలిపారు. ఈ కా ర్యక్రమాల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ గూడూరి కృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ చౌదరి, మధుసూదన్ రావ్, బొజ్జ పవన్, దొంతి లక్ష్మి ముత్యం గౌడ్, శివ రామ కృష్ణ, శంకర్ గౌడ్, బొద్దుల కృష్ణ, మహిపాల్, పరుశరామ్ గౌడ్, సమీ, మహేందర్ రెడ్డి, లల్లూ, గాడి రమేష్, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

హవేలీ ఘనపూర్ లో..

హవేలీ ఘనపూర్లో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ జన్మదిన వేడుకలు తాజా మాజీ సర్పంచ్ నోముల సవితా శ్రీకాంత్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించి, రాజకీయం గా మరెన్నో ఉన్నత పదవులు పొందాలని కోరుకుంటున్నా మని అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి, అరటి పండ్లు పంచారు. స్థానిక హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నోముల శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ అధ్యక్షులు పరశురాం గౌడ్, మండల అధ్యక్షులు లక్కర్స్ శ్రీను, మాజీ సర్పంచ్లు సుభాష్, కిరణ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు సాప రవి, రిజ్వాన్, శేఖర్, పోశెట్టి, సాయి బాబ, సాప సాయిలు, ప్రతాప్ రెడ్డి, రాజు, మహేష్, శర్మన్, కృష్ణ, సిద్ద గిరి గౌడ్, రాము, ఉదయ్ సుభాష్ నాయ క్, శశి, మల్లయ్య, నరేష్ గౌడ్, క్రాంతి, లక్ష్మయ్య, బ్రహ్మం, మోహన్, మాణిక్యం అశోక్, శంకర్ పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

- దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి చెరుకు

ప్రతిపక్షం, తొగుట, నవంబర్1: జూబ్లీహిల్స్ ఉపఎన్నికల లో పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలవాలనే సంకల్పంతో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీ నివాస్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి షేక్ పేట డివిజన్ పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ప్రజలను కలిసిన ఆయన రేవంత్ రెడ్డి ముఖ్య మంత్రిగా అయ్యాక రాష్ట్రంలో ప్రజల జీవన విధానం మా రిపోయిందని, ప్రతివర్గం అభివృద్ధి పథంలో నడుస్తోంది. ఇప్పుడు ఆ అభివృద్ధి జూబ్లీహిల్స్‌కి చేరాలంటే మన అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

“

కాశీబుగ్గ తొక్కిసలాటకు ప్రభుత్వ వైఫల్యమే కారణం. రాజకీయ ప్రత్యర్థుల్ని ఇరికించడంపై ఉన్న శ్రద్ధ, చంద్రబాబుకు ఆలయాలకు వచ్చే భక్తులకు భద్రత కల్పించడంలో లేదు. ఏకాదశి వేళ భక్తులు వస్తున్నారని తెలిసినా చర్యలు తీసుకోకపోవడం దారుణం. ఇప్పుడు ప్రైవేటు ఆలయం అంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. మృతుల కుటుంబాలకు రూ.25లక్షల పరిహారం ఇవ్వాలి.

- వైసీపీ అధినేత జగన్

రాష్ట్రానికి తలమానికంగా నర్సాపూర్ అర్బన్ ఎకో పార్క్

- దేవాదాయ ధర్మాదాయ పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 1:- పర్యావరణ పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, ఎకో పార్క్ వంటి ప్రాజెక్టులు కొత్త తరానికి స్ఫూర్తినందించే విధంగా ఉంటాయని దేవాదాయ ధర్మాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఎకో పార్క్, పార్కు కాటేజీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలోని ఒక అరుదైన పార్కును ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. పార్కులో అరుదైన మొక్కలు, ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. పార్కులో ఏర్పాటు చేసిన వేదికలు, లగ్జరీ సదుపాయాలు, పిక్నిక్ స్పాట్స్, ఈవెంట్స్ నిర్వహించుకునే ఫెసిలిటీలు, పచ్చదనం లాంటివి అన్ని సందర్శకులను ఆకట్టుకుంటాయని తెలిపారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ ఎకో పార్కు చెరువు డంపింగ్ యార్డ్ కావద్దన్నారు. ప్రకృతిని ప్రేమించాలని, కాలుష్యం తగ్గించాలని, పార్కు నిర్వాహకులకు సూచించారు. స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గానికి అడవి ఒక ఆస్తి, వరం అన్నారు. పార్క్ వల్ల నర్సాపూర్ కు మరింత గుర్తింపు వస్తుందన్నారు. నర్సాపూర్ లో డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని ఆపి, నియోజక వర్గ అభివృద్ధికి సహకరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ప్రిన్సిపల్ సెక్రెటరీ పర్యావరణం అడవులు సైన్స్ అండ్ టెక్నాలజీ హమ్మద్ నదీమ్ ,ప్రధాన అటవీ సంరక్షణ అధికారి,సువర్ణ, ముఖ్య అటవీ సంరక్షణ అధికారి ప్రియాంక వర్గీస్, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్,మృగవని గ్రూప్ ఆఫ్ రిసార్ట్స్ ఎండి ,విష్ణు చైతన్య రెడ్డి ,జిల్లా అటవీ అధికారి జోజీ, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి ,ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలపై భగ్గుమన్న బీజేపీ

- జిల్లావ్యాప్తంగా రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం
- సీఎం క్షమాపణలు చెప్పాలని డిమాండ్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 1: జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచార సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆపరేషన్ సిందూర్ , ఇండియన్ ఆర్మీ పై చేసిన వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు భగ్గుమన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహన, ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. జమ్మికుంట బీజేపీ శ్రేణులు చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఫైర్ అయ్యారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ అడుగుజాడల్లోనే నడుస్తున్నారన్నారు. దేశాన్ని, సైనికుల త్యాగాలను, పోరాటాలను కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ కించపరిచిన పంథాలోనే సీఎం రేవంత్ రెడ్డి వెళుతున్నారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ తో యావత్ ప్రపంచానికి భారతదేశ శక్తి ఏంటో తెలిసొచ్చిందని, సీఎం రేవంత్ రెడ్డికి మాత్రం ఇంకా తెలియకపోవడం దౌర్భాగ్యం అన్నారు. 'ఆపరేషన్ సింధూర్' అనే పేరులో భర్తలను కోల్పోయిన మహిళల త్యాగానికి నివాళి ఉందని, అలాంటి ఆపరేషన్ గురించి, ఇండియన్ ఆర్మీ గురించి రేవంత్ రెడ్డి కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆపరేషన్ సిందూర్ పై , ఇండియన్ ఆర్మీ పై చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ముగిసిన అర్బన్ బ్యాంక్ ఎన్నికలు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 1: కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. నగరంలోని ప్రభుత్వ ఉమేన్స్ డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో అర్బన్ బ్యాంకు ఎన్నికలు జరిగాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలలో 9,270 మంది వరకు ఓటర్లు ఉండగా 80 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకొనున్నారు. కరీంనగర్ అర్బన్ బ్యాంక్ సహకార ఎన్నికలలో కాంగ్రెస్ కు చెందిన వెలిచాల రాజేందర్ రావు, కర్ర రాజశేఖర్, విలాస్ రెడ్డి ప్యానల్లు పోటీ పడ్డాయి. బ్యాలెట్ బాక్కులు భద్ర పరిచారు. గెలుపు ఎవరిదో వేచి చూద్దాం.

మేకల మల్లయ్య ఆశయ బాటలో సాగుదాం

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ పిలుపు

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 1: శ్రమను నమ్ముకొని కష్టజీవులకు అండగా నిలిచి, అన్యాయాన్ని ఎదిరించిన శ్రమజీవి తోపుదు బండి మల్లయ్య యాదవ్ 12వ వర్ధంతి సందర్భంగా శనివారం నాడు హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవన్ లో ఆయన చిత్రపటానికి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపీపీ గడిపె మల్లేశ్, నాయకులు, కార్యకర్తలతో కలిసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గడిపె మల్లేశ్ మాట్లాడుతూ మేకల మల్లయ్య యాదవ్ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన చేసిన ప్రజా పోరాటాలు గుర్తు కొస్తున్నాయని, ఆయన ఆశించిన ఆశయం పేదల రాజ్యం రాలేదని అన్నారు. ఆయన చూపిన పోరాట బాటలో అన్యాయాన్ని ఎదిరించేందుకు నేటి యువతరం భారత కమ్యూనిస్టుపార్టీ చేస్తున్న ప్రజా పోరాటాలలో ముందుకు రావాలని, అప్పుడే మేకల మల్లయ్య యాదవ్, అమరవీరులు ఆశించిన ఆశయాలు ఫలిస్తాయని గడిపె మల్లేశ్ యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సీపీఐ మండల సహాయ కార్యదర్శి పోదిల కుమారస్వామి, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, సీపీఐ మండల నాయకులు అయిలేని మల్లారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పట్టణ అధ్యక్షులు కాల్వల ఎల్లయ్య, ఎఐవైఎఫ్ పట్టణ కన్వీనర్ దొంతరవేని రజిత, భారత జాతీయ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి పెద్ది నిర్మల, సిపిఐ నాయకులు మహ్మద్ అంకుశావలి, దండుగుల ఎల్లయ్య, దొంతరవేని రాజవ్వ,పున్న లక్ష్మి, మేకల మల్లయ్య యాదవ్ కుమారుడు చంద్రశేఖర్ యాదవ్, మునిగంటి శంకరాచారి, ఆవుకు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతులకు 50 వేల నష్టపరిహారం ఇవ్వాలి

- బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్1: మండలంలోని మడద గ్రామంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ అధ్వర్యంలో శనివారం బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నేతలు నష్టపోయిన పంటలను పరిశీలించారు. వరి కోత దశకు వచ్చినా నీటి ప్రవాహం తగ్గకపోవడంతో పంట మొలకలు రావడం ప్రారంభమైందని, రైతులు భారీ నష్టాలను ఎదుర్కొంటున్నారని నేతలు తెలిపారు.ఈ నేపథ్యంలో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు రూ.50వేల చొప్పున తక్షణ ఆర్థిక సహాయం అందించాలంటూ బీఎస్పీ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా నాయకులు వెంకటేష్, ఎలగందుల శంకర్, జేరిపోతుల రవీందర్, నియోజకవర్గ అధ్యక్షుడు వెలుపల రాజు, పార్టీ నాయకులు బోయిన బాబు, హనుమంతు, దుంద్ర రాంబాబు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ప్రమోద్ హత్య దుర్మార్గం

- ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 1: పోలీస్ కానిస్టేబుల్ ప్రమోద్ ను రౌడిషిటర్ రియాజ్ హత్య చేయడం దుర్మార్గమైన చర్య అని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం నిజామాబాద్ లో దళితుడైన పోలీస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ పరామర్శించి ప్రమోద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సేవలో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ ప్రమోద్ ను హత్య చేయడం బాధకరమన్నారు. ప్రమోద్ కుటుంబానికి అండగా నిలుస్తామని, మనోధైర్యంతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏ సీ పీ రాజా వెంకట్ రెడ్డి, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్, దళిత నేత బంగారు సాయిలు, పాతూరి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, సీపీలతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ భేటీ

రాష్ట్ర షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఇతర అధికారులతో భేటీ అయ్యారు. పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో అట్రాసిటీ కేసులలో పురోగతి, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, వివిధ శాఖల ద్వారా షెడ్యూల్డు కులాలు, తెగల వారి కోసం వెచ్చిస్తున్న నిధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై బాధితుల నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. ఐ.డీ.ఓ.సీకి చేరుకున్న కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పూల మొక్క అందించి స్వాగతం పలికారు.

మల్లన్న సన్నిధిలో మాజీ డీజీపీ దినేష్ రెడ్డి

ప్రతిపక్షం, కొమురవెల్లి, నవంబర్ 1: ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ దినేష్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆలయానికి వచ్చిన మాజీ డీజీపీకి ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రములుతో పాటు మల్లికార్జున స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మల్లికార్జున స్వామిని పలుమార్లు దర్శించుకొని మొక్కులు చెల్లించ్చునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, స్థానాచారి మల్లయ్య, అర్చకులు చిన్న మల్లికార్జున్, బసవేశ్వర్, మఠం జగదీశ్వర్ టెంపుల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీరాజ్యం, ఎస్ఐ రాజు తదితరులు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

- రైతుల ఆరుగాల కష్టం వృథా
- మాజీ ఎంపీపీ శ్రీకాంత్ రెడ్డి

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 1: అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీపీ శ్రీకాంత్ రెడ్డి, రాగుల సారయ్య డిమాండ్ చేశారు. శనివారం నంగునూరు మండలం మగ్దుంపూర్ గ్రామంలోని ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని వారు సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత కొద్ది రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఆరుగాల కష్టం వృథా అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన వడ్లను రైతులు నిల్వ ఉంచలేని పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం వెంటనే ముందుకు వచ్చి ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే, పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం తగిన ఆర్థిక భరోసా అందించాలని డిమాండ్ చేశారు. రైతు సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని, అధికారులు పరిస్థితిని సీరియస్‌గా పరిగణించాలని సూచించారు.

జాతీయ ఐక్యత దినోత్సవం ర్యాలీ

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 1: జాతీయ ఐక్యత దినోత్సవం పురస్కరించుకొని, సిద్దిపేట పట్టణంలోని గవర్నమెంట్ నర్సింగ్ కాలేజ్ నుండి వీర సావర్కర్ చౌరస్తా వరకు బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటర్లు, అధ్యాపకులు, ర్యాలీ నిర్వహించారు. ఐక్యమత్యంగా అందరం కలిసి జాతీయ భావం పెంపొందించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ విజయ్ కుమారి, ప్రొఫెసర్లు లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ప్రచారంలో సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్1: జరగబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లతో మాట్లాడుతూ 2023 లో కాంగ్రెస్ మేనిఫెస్టో నిర్విరామంగా అమలు కావాలంటే కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు పార్టీకి మంచి ఊపునిస్తుందన్నారు. ఈ ఉప ఎన్నికలో బిఆర్ఎస్, బిజెపి పార్టీలు తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ పై తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను మభ్యపెట్ట చూస్తున్నాయని నర్సారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ ఎఎంసి వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, సీనియర్ నాయకుడు గాడి పల్లి శ్రీనివాస్, నక్క రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- డీఎంహెచ్ఓ డా. సిహెచ్ ధనరాజ్

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 1: ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సిహెచ్ ధనరాజ్ సూచించారు. శనివారం ఆయన పుల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న వివిధ కార్యక్రమాల పనితీరును పరిశీలించిన ఆయన, ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షల విధానాన్ని తెలుసుకున్నారు. ఫార్మసీ గదిలో మందుల నిల్వలు, అత్యవసర మందుల లభ్యతను ఫార్మసీ అధికారిని అడిగి తెలుసుకున్నారు. తరువాత సమీపంలోని ఉపకేంద్రాన్ని సందర్శించి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. పిల్లలు, గర్భిణీ స్త్రీలకు సకాలంలో టీకాలు వేస్తున్నారా అనే విషయంపై సిబ్బందిని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. ప్రతి గర్భిణీ స్త్రీకి టీడీ సూది మందు, అలాగే పిల్లలకు వయసును బట్టి అవసరమైన అన్ని టీకాలు 100 శాతం వేయాలని ఆదేశించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే నిర్వహించాలని, వ్యాధుల తీవ్రతను బట్టి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గర్భిణీ స్త్రీ నమోదు నుంచి ప్రసవం వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. పాఠశాలలు, హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు వ్యక్తిగత, పరిసర పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. హాస్టళ్లలో ఆహారం నిల్వ గదులను పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా తెలుసుకోవాలని ఆదేశించారు. కుక్క కాటు, పాముకాటు వంటి అత్యవసర వ్యాక్సిన్లు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆయన హెచ్చరించారు. సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డా. వినోద్ బాబ్జి, డా. వైద్య సిబ్బంది, కవిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మొంథా తుఫాను రైతుల పాలిట మహావిపత్తు. తుఫాన్ ప్రభావంతో రూ.20వేల కోట్ల నష్టం వాటిల్లితే సీఎం చంద్రబాబు తక్కువ చేసి చూపిస్తున్నారు. పరిహారం ఇవ్వలేక ఇలా చేస్తున్నారు. బాధిత రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పన పరిహారం ఇవ్వాలి. ఈ విపత్తును కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించి, ఉచిత పంట బీమా పథకాన్ని తిరిగి అమలు చేయాలి.

- ఏపీసీసీ చీఫ్ షర్మిల

ప్రాంతీయం

బాల్య మిత్రులు, ఆత్మీయుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 1: మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి జన్మదినాన్ని పురస్కరించుకొని బాల్య మిత్రులు, ఆత్మీయులు, అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తల ఆధ్వర్యంలో మక్తల్ గవర్నమెంట్ హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మంత్రి మాతృమూర్తి రాములమ్మ హాజరై ప్రారంభించారు. జన్మదినం సందర్భంగా కేకులు, శాలువాలు కంటే ప్రజాసేవ, ప్రజల ఆరోగ్యం ముఖ్యం అని మంత్రి పిలుపునివ్వడంతో దాన్ని అనుసరిస్తూ శనివారం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రెడ్ క్రాస్ సొసైటీ, మున్సిపల్ సిబ్బంది, డాక్టర్లు నర్సులు మిగతా హాస్పిటల్ సిబ్బందికి అభిమానులు కాంగ్రెస్ కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

సాగులో ఉన్న పేదలందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలి

- **మొంథా తుపాను వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి**

ప్రతిపక్షం గుండాల నవంబర్ 1: అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి సాగులో ఉన్న పేదలందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన మండల జనరల్ బాడీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ సిపిఎం పార్టీ అనేక సంవత్సరాల పోరాటాల ఫలితంగా అటవీ హక్కుల చట్టం సాదించుకున్నామన్నారు, కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ హక్కుల చట్టాన్నిసంపూర్ణంగా అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రతి కుటుంబానికి పది ఎకరాల భూమికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనేక మంది సాగుదారులకు హక్కులు రాలేదని అన్నారు, గిరిజనులకు రెండు, మూడు చోట్ల సాగు భూమి ఉంటే ఒకచోట మాత్రమే సర్వే చేసి హక్కు పత్రాలు ఇచ్చారని, మిగిలిన భూమికి పట్టాలు ఇవ్వలేదన్నారు. సాగులో ఉన్న గిరిజనేతరులకు అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేసి హక్కు పత్రాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. మొంథా తుపాను బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి.మొంథా తుపాను వల్ల మండలంలో మొక్కజొన్న,వరి,పత్తి , మిర్చి పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.డి జలాల్,తోలెం గోపి,వజ్జ సురేష్, దుర్గం సమ్మయ్య,జనగం వీరాస్వామి,మండల నాయకులు మాజీ సర్పంచ్ దుగ్గి రామ్మూర్తి,గడ్డం క్రిష్ణ, రాజేష్, శేఖర్, రామస్వామి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ గ్రామీణ ఉత్పత్తులకు ప్రోత్సాహం

- **జాతీయ ఆర్గానిక్ రైతుల సంతను ప్రారంభించిన ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్**

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్1: ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించే దిశగా, సేంద్రియ వ్యవసాయం, చేనేత ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం పబ్లిక్ గార్డెన్స్ లోని నేరెళ్ల వేణుమాధవ్ కళ వేదికలో ఏర్పాటు చేసిన జాతీయ ఆర్గానిక్ రైతుల సంతను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ సేంద్రియ ఉత్పత్తుల వినియోగం మన ఆరోగ్యానికి మేలు చేస్తుంది. గ్రామీణ రైతులు ఉత్పత్తి చేసే ఆర్గానిక్ ఆహార పదార్థాలు, నేటి మారుతున్న మోడరన్ ఫుడ్ కంటే ఎంతో మెరుగైనవి అన్నారు.ఈ సంత ద్వారా స్థానిక రైతులకు కొత్త మార్కెట్ అవకాశాలు లభిస్తాయి. వినియోగదారులు కూడా నాణ్యమైన సేంద్రియ ఉత్పత్తులను నేరుగా రైతుల వద్ద నుండే పొందగలరు అని తెలిపారు. తరువాత ఎమ్మెల్యే, కలెక్టర్ సంతలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. రైతులు, చేనేత కార్మికులు, గిరిజన కళాకారులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి ఉత్పత్తుల ప్రత్యేకతలు, ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎంపీటీసీ

ప్రతిపక్షం, నిర్మల్, నవంబర్ 1: లక్ష్మణచాంద మండలం పీచర గ్రామ మాజీ ఎంపీటీసీ బుర్రి భూమన్న బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి శనివారం నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు గారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రజా సంక్షేమ పథకాలు చూసి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నానని బుర్రి భూమన్న తెలిపారు. భూమన్నతో పాటు మరో 50 మంది యువకులు, గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీహరి రావు మాట్లాడుతూ "రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రతి పేద కుటుంబం వరకు పార్టీ పథకాలను చేరవేయాలన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు న్యాయం చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వడ్నాల రాజేశ్వర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కొండ్రు నరేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రతాపరెడ్డి, మాజీ డైరెక్టర్ గుర్రాల లింగారెడ్డి, ఆత్మ డైరెక్టర్ కిరణ్ ఠాగూర్ పాల్గొన్నారు.

నవీపేట్ మండలంలో మహిళ దారుణ హత్య

- **ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీపీ**

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 1: జిల్లాలోని నవీపేట్ మండలంలో ఓ మహిళను దుండగులు దారుణంగా హత్య చేశారు. మండలంలోని ఫకీరాబాద్ మిట్టాపూర్ మార్గంలో గుర్తు తెలియని మహిళ మృత దేహాన్ని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. మహిళను వివస్త్రను చేసి దారుణంగా హతమార్చారు. ఆమె శరీరం నుంచి తలను వేరు చేసి మొండాన్ని పడేశారు. ఆమె చేయిని సైతం దుండగులు మణికట్టు వరకు నరికి వేశారు. నిజామాబాద్ సీపీ సాయి చైతన్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నవీపేట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, నవీపేట్ మండలంలో మహిళల హత్యలు వెలుగు చూస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వారం వ్యవధిలో ఇది రెండవ హత్య కావడం గమనార్హం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ ఓ ఫేక్ పార్టీ. ఆ పార్టీకి ఏం దొరకడం లేదు. ఏ ప్రమాదం జరిగినా ఫేక్ ప్రచారం చేస్తున్నారు. కర్నూలు బస్సు ప్రమాదంపైనా దుష్ప్రచారం చేశారు. వైసీపీకి ఓ పాంప్లెట్, ఛానెల్ ఉన్నాయి. వాటితో శవరాజకీయం చేస్తోంది. కమ్మ, కాపు మధ్య విద్వేషాలు రగిలించేందుకు యత్నిస్తున్నారు. వీటిపై తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదు. రాజకీయాల్లో ఉండే అర్హత వారికి లేదన్నారు.

- ఏపీ సీఎం చంద్రబాబు

కాలుష్య కారక కంపెనీలను మూసివేయాలంటూ

దోమడుగు ప్రజల భారీ నిరసన ర్యాలీ

- **కాలుష్య వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 1: బొంతపల్లి పారిశ్రామిక వాడ దోమడుగు గ్రామంలోని నీటి వనరులను, భూగర్భ జలాలను కలుషితం చేస్తూ, తమకు అన్ని విధాలుగా నష్టం చేకూర్చుతున్న కాలుష్యకారక కంపెనీలకు వ్యతిరేకంగా దోమడుగు ప్రజలు చైతన్యం చాటారు. నల్లకుంట చెరువు పూర్తిగా విషతుల్యం కావడంతో గత కొన్ని రోజులుగా వాళ్ళు వివిధ రూపాల్లో పోరాటం కొనసాగిస్తున్నారు. శనివారం స్థానికులంతా కలిసి, వివిధ ప్రజాసంఘాల మద్దతుతో కాలుష్య వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. నల్లకుంట చెరువు కలుషితం కావడానికి హెటిరో డ్రగ్స్ యూనిట్ 1 కారణమంటూ వాళ్లు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తక్షణమే ఈ పరిశ్రమను మూసివేయాలని డిమాండ్ చేశారు. కాలుష్య జలాల కారణంగా చనిపోయిన దూడల బొమ్మలను ఊరేగింపులో ప్రదర్శించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, తమ ఊరికి తీవ్ర నష్టం చేస్తున్న కాలుష్యకారక కంపెనీలపై చర్యలు తీసుకోవాలని నినదించారు. కనీసం తమ గ్రామంలో పండిన బియ్యం కూడా ఎవరు కొనడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. దోమడుగు బియ్యం అని చెబితేనే ఎవరు కొనడం లేదన్నారు. కలుషిత జలాల వల్ల బోర్లలోను నీళ్లన్నీ కలుషితం అయ్యాయని మహిళలు ఈ సందర్భంగా వివరించారు. చిన్నపిల్లల బొక్కలు సైతం అరిగిపోతున్నాయని, డాక్టర్ల వద్దకు వెళ్తే తాగుతున్న నీళ్లే కారణమని చెబుతున్నారని వాళ్ళు వివరించారు. తమ ఆరోగ్యాలు పాడైపోతున్నాయని, ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. విపరీతమైన ఘాటైన వాసనల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ ఊర్లో కాలుష్య తీవ్రత అధికంగా ఉండడంతో, కనీసం చుట్టాలు కూడా తమ ఇండ్లకు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లను తాగిన పశువులు మృత్యువాత పడుతున్నాయని వివరించారు. కాలుష్యకారక కంపెనీ హెటిరోను మూసివేయని పక్షంలో, తమ నిరసనను కొనసాగిస్తామని గ్రామస్తులు నినదించారు. ఇంత జరుగుతున్న ఏమాత్రం పట్టించుకోకుండా కంపెనీ యాజమాన్యానికే వత్తాసు పలుకుతున్న పీసీబీ అధికారుల తీరును ఎండగట్టారు. అవినీతి అధికారుల పైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసనల్లో మీరా సంఘమిత్ర, నాపమ్ ఎన్ ఏ పి ఎం జాతీయ నాయకురాలు, టీపీజేఏసీ నాయకులు రాజగోపాల్ రెడ్డి, ముత్యాలు, శ్రీనివాస్, ప్రజా ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక ప్రతినిధులు దీప్తి, హేమంత్, విజయలక్ష్మి, కాలుష్య వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ మంగయ్య, సభ్యులు బాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, స్వేచ్ఛ రెడ్డి, ఆనంద్ రెడ్డి, శ్రీధర్, ఎల్లారెడ్డి, మురారి మధుకర్, సత్తిరెడ్డి, కిష్టారెడ్డి, బాలు గౌడ్, ఎం.యాదగిరి, పి. శంకరయ్య, బొంది వెంకటేష్, జయమ్మ, స్వప్న, శారద తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జన్మదినం సందర్భంగా

బ్రెడ్లు, పండ్లు పంపిణీ

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 1: మక్తల్ నియోజకవర్గం నర్వ మండల కేంద్రంలో మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి జన్మదినం సందర్భంగా నర్వ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణాసంచా కాల్చి కేక్ కట్ చేశారు. అనంతరం నర్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ ఆధ్వర్యంలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు,మండల సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, డైరెక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కడెం మండలం లక్ష్మీసాగర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ తో కలిసి ప్రారంభించారు. ఈ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, తహసిల్దార్ ప్రభాకర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్

వరద నష్టంపై సర్వే త్వరగా పూర్తి చేయాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 1: వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టంపై సర్వే త్వరగా పూర్తిచేసి ఆ నివేదికను త్వరగా అందజేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. శనివారం తీవ్ర వరద ప్రభావంతో హనుమకొండలోని సమ్మయ్య నగర్ పరిధిలోని కాలనీల్లో జరిగిన నష్టం పై అధికారులు ప్రాథమిక అంచనా కోసం సర్వే నిర్వహిస్తుండగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న సర్వే తీరును కలెక్టర్ పరిశీలించి అధికారులు, బాధితులతో మాట్లాడారు. అదేవిధంగా అమరావతి నగర్ లో దెబ్బతిన్న రోడ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వరద ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఇంటికి వెళ్లి నష్టం జరిగిన వివరాలను నమోదు చేయాలని అధికారులకు సూచించారు. నష్టపరిహారాన్ని అందించేందుకు ప్రాథమిక అంచనా కోసం చేపట్టిన ఈ సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. నష్టపోయిన ఏ ఒక్క ఇల్లు కూడా విడిచి పెట్టొద్దని పేర్కొన్నారు. వరద ముంపు భారీ నుండి తప్పించేందుకు సమ్మయ్య నగర్ , వివేక్ నగర్, అమరావతి నగర్, టీవీ టవర్ కాలనీలలో శాశ్వత పరిష్కారం కోసం రిటైనింగ్ వాల్స్ ఏర్పాటు కోసం అంచనా వేసి ప్రతిపాదనలు అందజేయాలన్నారు. ముంపు కాలనీలలో పారిశుధ్య నిర్వహణను వేగవంతం చేయాలన్నారు. అక్కడ ఉన్న బాధిత కుటుంబాలతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరద నష్టం వల్ల కలిగిన వివరాల నివేదికను ప్రభుత్వానికి అందించి పరిహారం అందించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, హనుమకొండ తహసిల్దార్ రవీందర్ రెడ్డి, సిఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, ఆర్ అండ్ బి డీఈలు ఉదయ్, గోపికృష్ణ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



సుప్రీం జడ్జిపై జరిగిన దాడిని ఖండిస్తూ చలో హైదరాబాద్

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయనా పేట్, నవంబర్ 1: సుప్రీం కోర్ట్ జస్టిస్ గావాయి పైన జరిగిన దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ మక్తల్ టౌన్ అధ్యక్షులు గోలపల్లి జ్ఞాన ప్రకాష్ మాదిగ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కోశాధికారి జగ్గాలి అంజప్ప, నాయకులు కర్రెమ్ భాస్కర్, కర్రెమ్ శ్రీను మాదిగ, మ్యాథరి గోపాల్ మాదిగ, ఆంజనేయులు మాదిగ, సవరప్పా మాదిగ, తదితర నాయకులు పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- **మాదకద్రవ్యాలఅక్రమ రవాణాపై కఠిన చర్యలు**
- **అదనపు కలెక్టర్ చంద్రశేఖర్**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 1 : మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మార్గదర్శకత్వంలో జిల్లా యంత్రాంగం సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఎమ్మెన్నార్ వైద్య కళాశాలలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యాసంస్థల్లో యాంటి డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సంగారెడ్డిని మాదకద్రవ్య రహిత జిల్లాగా మలచడం లక్ష్యమని స్పష్టం చేశారు. నషా ముక్త్ భారత్ అభియాన్ ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా సంక్షేమాధికారి కె.లలితా కుమారి తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేందుకు " మిషన్ పరివర్తన " కార్యక్రమం ద్వారా పలు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మాదకద్రవ్యాలను సేవిస్తున్న లేదా విక్రయిస్తున్నవారి వివరాలను హెల్ప్‌లైన్ 14446 కు తెలియజేయాలని సూచించారు. అనంతరం నషా ముక్త్ భారత్ కు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాదకద్రవ్యాలు మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు నాటక కళా ప్రదర్శన ద్వారా మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రఘునందన్ రావు, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ఖాసిం బేగ్, వైద్య కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, దివ్యాంగుల శాఖ సిబ్బంది, నషా ముక్త్ భారత్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్ ఉమేరా, సహిష్ట, ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్‌లో రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు

- 7 నెలలలో జీఎస్టీ 9 శాతం వృద్ధి నమోదు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 1 : జీఎస్టీ వసూళ్లు ;అక్టోబర్ మాసంలో రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. దాదాపు రూ.1.95లక్షల కోట్లు వసూలయ్యాయి. నిరుడు ఇదే నెలతో పోలిస్తే 4.6 శాతం పెరిగాయి. అపుడు జీఎస్టీ వసూళ్లు రూ.1.87లక్షలుగా ఉన్నాయి. జీఎస్టీ వసూళ్లు అక్టోబర్ లో వృద్ధిని నమోదు చేయగా, సెస్ వసూళ్లు మాత్రం తగ్గాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి ఏడు నెలలలో జీఎస్టీ వసూళ్లు 9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2017లో జీఎస్టీని అమలు చేసినప్పటి నుంచి ఇదే అత్యధికం. భారత జీఎస్టీ వ్యవస్థ 2024-25లో రూ.22.08 లక్షల కోట్ల రికార్డు స్థూల వసూళ్లతో మైలురాయిని సాధించింది. అక్టోబర్ నెలలో జీఎస్టీ రూ.1.87 లక్షల కోట్ల వసూళ్లు జరిగాయి. మొత్తం 1.96 లక్షల కోట్లకు చేరింది. ఈ యేడాది ఆగస్టులో రూ.1.86లక్షలు కోట్లు వసూలవగా, సెప్టెంబర్ నెలలో 1.89లక్షలు కోట్లు వసూలైందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గణాంకాలు తెలిపాయి. నిరుటితో పోల్చినప్పుడు 4.6 శాతం వృద్ధి నమోదైంది. గడిచిన నెలలతో పోల్చి చూస్తే సగటున 9 శాతం వృద్ధి కంటే తక్కువ నమోదైంది. అక్టోబర్ జీఎస్టీ వసూళ్లలో రూ.1.45 లక్షల కోట్లు దేశీయ వినియోగం నుంచి, దిగుమతులపై సుంకాల ద్వారా రూ.50,884 కోట్లు వచ్చాయి. జీఎస్టీ రిఫండ్స్ రూ.26,934 కోట్లు మినహాయిస్తే, నికర జీఎస్టీ వసూళ్లు రూ.1.69 లక్షల కోట్లుగా నమోదయ్యాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ పేర్కొంది. దసరా సమయంలో కేంద్రం జీఎస్టీ సంస్కరణలు అమలులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. చాలా వస్తువులపై కేంద్రం జీఎస్టీని తగ్గించింది. దాంతో దసరా నవరాత్రి, దీపావళి సమయంలో భారీగా కొనుగోళ్లు జరిగాయి.





హెల్దీ అనుకొని తింటున్నారా..?

మనం తీసుకునే ఆహారం కారణంగానే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. మనం మంచి ఫుడ్స్ తింటే హెల్దీగా ఉంటాం. అదే విధంగా, కొన్ని ఫుడ్స్‌ని ఆరోగ్య సమస్యల్ని తీసుకొస్తాయి. అందులో ముఖ్యంగా, కొన్ని ఫుడ్స్ క్యాన్సర్‌కి కారణమవుతాయి.

హెల్దీ ఫుడ్స్ అనగానే మనకి మిల్లెట్స్, నెయ్యి, కూరగాయలు, తాజా పండ్లు, పప్పులే మన ఊహలోకి కనిపిస్తాయి. ఇవి శరీరానికి బలాన్నిచ్చి ఆరోగ్య సమస్యలకి దూరంగా ఉంచుతాయి. ఇవి ఓ వైపు. మరోవైపు కొన్ని ఫుడ్స్, డ్రింక్స్ మన ఆరోగ్యానికి అస్సలు మంచివి కావు. ఇవి మన శరీరంలోని రక్తనాళాలు, ఇతర ఆరోగ్యాన్ని పెంచే గొట్టాల్ని ఇరుగ్గా చేస్తాయి. ఈ నాళాలు, గొట్టాల గుండా రక్తం, శ్వాస, ఇతర ద్రవాలు సరఫరా అవుతాయి. అయితే, అన్‌హెల్దీ ఫుడ్ తినడం వల్ల కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీంతో షుగర్ లెవల్స్, టాక్సిన్స్ పెరుగుతాయి. దీంతోపాటు వ్యర్థపదార్థాలు కూడా పేరుకుపోతాయి. ఈ పరిస్థితి కారణంగా షుగర్, గుండె జబ్బులు, ఊబకాయం, క్యాన్సర్ వంటి సమస్యలొస్తాయి. అందుకే, అలాంటి ఫుడ్స్ తినకపోవడమే మంచివి.

కల్తీ నెయ్యి

నెయ్యి ఎంత ఆరోగ్యకరమో అందరికీ తెలిసిందే. అందుకే, అందరూ నెయ్యిని డైట్‌లో యాడ్ చేస్తారు. ఈ నేపథ్యంలోనే చాలా మంది నెయ్యిని కల్తీ చేస్తున్నారు. ఇలాంటి కల్తీ నెయ్యి తినడం వల్ల శరీరంలో చాలా సమస్యలొస్తాయి. కారణం కల్తీ నెయ్యిలో కెమికల్స్, సింథటిక్ కలర్స్ వేస్తారు. వీటివల్ల క్యాన్సర్స్ లాంటి ప్రమాద సమస్యలొస్తాయి.

రసాయనాలు వేసి పండించిన పండ్లు

పండ్లు మంచివే. కానీ, కెమికల్స్ వేసి పండించిన పండ్లు ఆరోగ్యానికి అస్సలు మంచివి కావు. ఈ మధ్యకాలంలో చాలా రకాల పండ్లని అలానే తయారుచేస్తున్నారు. వీటిని తినడం వల్ల ప్రమాదకర సమస్యలొస్తున్నాయి. ఆపిల్స్ లాంటి పండ్లు చూడ్డానికి ఎర్రగా అందంగా కనిపించేందుకు మైనం వాడతున్నారు. ఇలాంటి పండ్లు తింటే గుండె జబ్బులు, ఫుడ్ పాయిజనింగ్, కొలొరెక్టల్ క్యాన్సర్స్ వస్తాయి.

చిప్స్

చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్ వంటివి తినడానికి చాలా టేస్టీగా ఉంటాయి. కానీ, వీటిలో ఎక్కువగా కొవ్వు ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ పెరుగుతుంది. ఈ కొలెస్ట్రాల్ గుండె ధమనుల్లో పేరుకుపోయి గుండెపోటుకి కారణమవుతుంది. కారణం ఎక్కువ వేడిపై చిప్స్‌ని వేయించడమే. ఇలా వేయించడం వల్లే క్యాన్సర్‌కి కారణమయ్యే రసాయనాలు విడుదలై సమస్యల్ని తీసుకొస్తాయి.

ప్యాకేజ్డ్ జ్యూస్‌లు

పండ్ల రసాలు తాగడం వల్ల శరీరానికి ఎనర్జీ వస్తుంది. అయితే, ప్యాకేజ్డ్ జ్యూస్ తాగితే మాత్రం అస్సలు మంచిది కాదు. ఇందులో ఆర్టిఫీషియల్ కలర్స్, షుగర్స్ కలుస్తాయి. వీటి వల్ల డయాబెటిస్ వంటి ప్రమాదకర సమస్యలొస్తాయి. ఇవి ఆరోగ్యానికి అంత మంచిది కాదు.

ఎనర్జీ డ్రింక్స్

ప్యాకేజ్ చేసిన ఎనర్జీ డ్రింక్స్ మనకి అప్పటికప్పుడు శక్తిని అందించినప్పటికీ ఆరోగ్యానికి మాత్రం అస్సలు మంచివి కావు. ఎందుకంటే ఇవి ఎక్కువ పంచదార, కెఫిన్‌తో తయారు చేస్తారు. వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో షుగర్ లెవల్స్ పెరిగి, బ్రెయిన్ హెల్త్ కూడా తగ్గుతుంది.

వీటితో పాటు

కేక్స్, బిస్కెట్స్వైట్ బ్రెడ్పాసెస్డ్, ఫ్రోజెన్ మీట్పిజా, బర్గర్స్ఫాస్ట్ ఫుడ్‌ఆల్కహాల్, స్మోకింగ్. ఇవన్నీ కూడా ఆరోగ్య సమస్యలకి కారణమవుతాయి. కాబట్టి, వీటిని తీసుకోకపోవడమే మంచిది.

ఇక నుంచి బ్యాంకులో నలుగురు నామినీలు

- నిబంధనలలో కీలక మార్పులు చేసిన కేంద్రం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 1 : బ్యాంకు ఖాతాదారులకు అలెర్ట్. బ్యాంకు నిబంధనలలో కీలక మార్పులు జరుగబోతున్నాయి. మారిన నిబంధనలు నవంబర్ ఒకటి నుంచి అమలులోకి వచ్చాయి. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ బ్యాంక్ అకౌంట్ల నామినీల విషయంలో కీలక మార్పులు చేసింది. ఇకపై నుంచి నలుగురు నామినీలను ఎంపిక చేసుకునే వీలు కల్పించింది. దాంతో బ్యాంకింగ్ సిస్టమ్‌లో క్లెయిమ్ సెటిల్‌మెంట్ మరింత సులభతరం కానున్నది. ఇందు కోసం కేంద్రం బ్యాంకింగ్ చట్టాలు (సవరణ) యాక్ట్‌లో మార్పులు చేసింది.బ్యాంకు నామినీలను నలుగురిని ఎంపిక చేసుకునేందుకు అవకాశం ఉండడంతో ఖాతాదారులకు ఉపయోగకరంగా ఉండనున్నది. వాస్తవానికి గతంలో ఈ పరిమితి ఇద్దరికి మాత్రమే అవకాశం ఉండేది. తాజాగా నలుగురు నామినీలు కలిగి ఉండడంతో వ్యక్తులు వారి నిధులు, ఆస్తులపై ఎక్కువ నియంత్రణను కలిగి ఉండనున్నారు. ఈ చర్య క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియను మరింత పారదర్శకంగా, సులభంగా, క్రమబద్ధీకరించడానికి కేంద్రం ఈ మార్పులు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం బ్యాంకులు నామినీ ఈమెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా రికార్డు చేయాల్సి ఉంటుంది. బ్యాంక్ ఖాతాదారుల నిధులను రక్షించేందుకు, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో త్వరిత క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ను నిర్ధారించేందుకు ఈ మార్పును అమలులోకి తీసుకువస్తున్నది. ఇది బ్యాంక్ వ్యవస్థలో జవాబుదారీతనం పెంచుతుంది.

వేడెక్కిన బిహార్ ఎన్నికల రణరంగం

- అన్ని రాజకీయ పార్టీల పోటాపోటీ హామీలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 1: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్ రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు ప్రచారంలో మరింత వేగాన్ని పెంచాయి. ఓటర్లను ఆకర్షించడానికి.. వారి మనసు దోచుకోవడానికి హామీల వర్షం కురిపిస్తున్నాయి. శుక్రవారం అధికార ఎన్డీయే ఎన్నికల మేనిఫెస్టోను ఆవిష్కరించింది. వలస కార్మికులను దృష్టిలో పెట్టుకొని మేనిఫెస్టో రూపొందించినట్టు కనిపిస్తోంది. కోటి ప్రభుత్వ ఉద్యోగాలను సృష్టిస్తామని హామీ ఇవ్వడం మేనిఫెస్టోలో ప్రధాన అంశం. పేదలకు పంచామృతం పేరుతో ఉచిత రేషన్ అందిస్తామంది. ఐదు లక్షల విలువైన ఉచిత చికిత్స పేదలకు అందించనుంది. 50 లక్షల వరకు పక్కా గృహాలను నిర్మించనుంది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద ఆర్థిక సహాయాన్ని ఆరు వేల నుంచి తొమ్మిది వేలకు పెంచనుంది. మత్స్యకారులకు యేటా 4500 నుంచి 9000 వరకు సహాయం అందిస్తుంది. అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధర చెల్లిస్తుంది. ప్రతి జిల్లాలో ఒక ఫ్యాక్టరీని నిర్మిస్తుంది. పది కొత్త పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తుంది. ఐటీ పార్కులు, సెజ్ లు, డెయిరీ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు, రాష్ట్రవ్యాప్తంగా ఐదు కొత్త ఎక్స్‌ప్రెస్ హైవేలను నిర్మించనుంది. ప్రతి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తుంది. తొలి కేబినెట్ భేటీలో దీనిపైన స్పష్టమైన నిర్ణయం తీసుకుంటుంది. 20 నెలలలోనే ఈ ప్రక్రియ పూర్తి చేస్తుంది. జీవికా దీదీలను పర్మినెంట్ చేస్తుంది. నెలకు 30 వేల వరకు వేతనం చెల్లిస్తుంది.

రేర్ ఎలిమెంట్స్ అన్వేషణలో భారత్

- పోటీ పడుతున్న అమెరికా, చైనా దేశాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్1: ప్రస్తుతం ప్రపంచంలో ఏం నడుస్తుందంటే, ఒకవైపు అమెరికా టారిఫ్‌లు, ఇంకోవైపు, రేర్ ఎర్త్ మినరల్స్ కోసం ప్రపంచ దేశాల మధ్య పోటీ. ఎందుకంటే వీటి అవసరం అన్ని దేశాలకు ఉంది. కానీ, ఇవి దొరకడం అరుదు. అందుకే వీటిపై ఆధిపత్యం కోసం అమెరికా, చైనా దేశాలు పోటీ పడుతున్నాయి. ప్రస్తుతం చైనా ఆధిపత్యం కొనసాగుతోంది. ఇందులోకి ఇప్పుడు భారత్ కూడా ఎంటర్ అవుతోంది. రియర్ ఎర్త్ మెటల్స్‌కు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ రికార్డ్ స్థాయిలో పెరుగుతోంది. విద్యుద్దీకరణ, పునరుత్పాదక విద్యుత్, అత్యాధునిక ఎలక్ట్రానిక్స్ రంగాలలో వీటి వినియోగం కీలకంగా మారింది.

2023లో రెండు లక్షల మెట్రిక్ టన్నుల డిమాండ్ ఉండగా, 2030 కల్లా 4 లక్షలకు చేరే అవకాశం ఉంది. ఇండస్ట్రీ అవసరాల కారణంగా మెగ్నెట్ తయారీకి అవసరమైన నియోడైమియం, ప్రసియోడైమియం, డిస్ప్రోసియం వంటి రేర్ ఎర్త్ డిమాండ్ 10 శాతం వృద్ధి కనిపిస్తోంది. భారత్‌లో 8.52 మిలియన్ టన్నులు రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ నిల్వలు ఉన్నాయి. వీటిలో 7.23 మిలియన్ టన్నులు మోనజైట్ లో, 1.29 మిలియన్ టన్నులు గుజరాత్, రాజస్తాన్‌లోని హార్డ్ రాక్ డిపాజిట్లలో ఉన్నాయి. దేశంలోని తీర ప్రాంతాలైన తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, గుజరాత్, ఝార్ఖండ్ మొదలైన రాష్ట్రాలలో ఎక్కువగా ఈ ఖనిజాలు ఉన్నాయి. జాతీయ శాస్త్రీయ సంస్థలు నూతన వెలికితీత, శుద్ధీకరణ పనులలో ఉన్నాయని ప్రభుత్వం వెల్లడించింది.

ట్రంప్ అధికారాలకు సెనేట్ కత్తెర

- 51-47 ఓట్లతో టారిఫ్‌ల నిరాకరణ

న్యూయార్క్ (అమెరికా), నవంబర్ 1: 'అమెరికా ఫస్ట్' 'గ్రేట్ అమెరికా మేక్ ఎగైన్' నినాదాలతో అమెరికన్లను ఆకట్టుకుని రెండోసారి అధికారంలోకి వచ్చారు డొనాల్డ్ ట్రంప్. ఆయన బాధ్యతలు చేపట్టి పది నెలలైంది. కానీ అమెరికన్లు, అమెరికాలోని విదేశీయులు, ప్రపంచ దేశాలు పది నెలల పాలను పదేండ్ల భారంగా భావిస్తున్నారు. 'అమెరికా ఫస్ట్' పేరుతో ట్రంప్ చేస్తున్న అరాచకాలతో అందరూ ఇబ్బంది పడుతున్నారు. నచ్చిన దేశాలపై తక్కువ, మాట వినని దేశాలపై భారీగా దిగుమతి సుంకాలు విధించారు. టారిఫ్‌ల అంశం తన పరిధిలో లేకపోయినా ఏకపక్షంగా అధికారిక ఉత్తర్వులు జారీ చేసి అమలు చేస్తున్నారు. ట్రంప్ దూకుడుకు సెనేట్ బ్రేక్ వేసింది. అంతర్జాతీయ టారిఫ్‌లను సెనేట్ గట్టిగా వ్యతిరేకించింది. 51-47 ఓట్లతో టారిఫ్‌ను ఓడించింది. దీంతో వాణిజ్య యుద్ధాలు ముగిసే అవకాశం కనిపిస్తోంది. ఇది రెండు పార్టీల సమ్మతితో జరిగిన మొదటి పెద్ద విజయం, దేశీయ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపిస్తోంది. సెనేట్‌లో డెమొక్రట్లు ప్రధానంగా మద్దతు ఇచ్చినప్పటికీ, నలుగురు రిపబ్లికన్ సెనేటర్లు కీలక మలుపు తిప్పారు. ఈ వారం ముందు బ్రెజిల్, కెనడా టారిఫ్‌లపై కూడా సారూప్య ఓట్లు జరిగాయి. ఈ ఘటనలు ట్రంప్ విధానాలకు సవాల్‌గా మారాయి. ఆర్థిక నిపుణులు ధరల పెరుగుదలను నివారించే అవకాశంగా చూస్తున్నారు. ఇది కాంగ్రెస్ అధికారాలను పునరుద్ధరించే సంకేతం. టారిఫ్‌లు రద్దు కావడంతో దిగుమతులు సులభతరమవుతాయి. ఉత్పత్తి ధరలు తగ్గుతాయని నిపుణులు అంచనా. ఇది ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో లాభాలను పెంచుతుంది. అయితే, దేశీయ ఉత్పాదకులకు సవాళ్లు పెరిగే అవకాశం ఉంది.



భారత అమ్మాయిలకు బీసీసీఐ నజరానా

- తుది పోరులో నెగ్గితే 125 కోట్ల నగదు బహుమతి

మహిళల వన్డే వరల్డ్ కప్ ఫైనల్‌మ్యాచ్ నవీ ముంబైలో ఆదివారం జరుగనుంది. భారత్. సౌతాఫ్రికాలో ఎవరు నెగ్గినా ఈ ప్రతిష్ఠాత్మక ట్రోఫీని అందుకోవడం తొలిసారే అవుతుంది. ఈ నేపథ్యంలో ఇరు జట్లు శనివారం తీవ్రంగా ప్రాక్టీస్ చేశాయి. ఈ క్రమంలోనే బీసీసీఐ మహిళల జట్టుకు భారీ బొనాంజా ప్రకటించే అవకాశాలు ఉన్నాయని సమాచారం. నిరుడు బార్బడోస్ లో రోహిత్ శర్మ నాయకత్వంలోని భారత పురుషుల జట్టు టీ20 వరల్డ్‌కప్ గెలుచుకుంది.దాదాపు 17 యేండ్ల తర్వాత కప్పు సాధించడంతో అప్పుడు టీమిండియాతోపాటు భారత్‌లో సంబరాలు జరిగాయి. ఈ సంబరాలను మరింత పెంచుతూ అప్పుడుపురుషుల జట్టుకు రూ.125 కోట్లు భారీ నజరానాను బీసీసీఐ ప్రకటించింది. కోచింగ్ స్టాఫ్, మెడికల్ స్టాఫ్ అందరికీ నగదు బహుమతులు ఇచ్చింది. ఇప్పుడు కూడా అదే ఆలోచనలో ఉందని సమాచారం. ఆదివారం జరిగే మహిళల తుది పోరులో భారత అమ్మాయిలు నెగ్గితే వారికి కూడా రూ.125 కోట్లకు తగ్గకుండా అంతే మొత్తంలో నగదు బహుమతి ఇవ్వాలని బీసీసీఐ ఆలోచిస్తోందని తెలిసింది. క్రికెట్ లో పురుషులు, మహిళల జట్లకు బేధం చూపించకుండా ఇద్దరికీ 'సమాన వేతనం' అందించాలని అప్పటి బీసీసీఐ సెక్రటరీ, ఐసీసీ ప్రస్తుత ఛైర్మన్ జై షా ప్రతిపాదించారు. ఈ క్రమంలోనే ఇప్పుడు మహిళల జట్టు వరల్డ్‌కప్ గెలిస్తే భారీ మొత్తంలో నజరానా అందించే అవకాశాలున్నాయి. కాగా, ఐసీసీ కూడా మహిళల వరల్డ్‌కప్ ప్రైజ్‌మనీ పెంచింది. ఈసారి ఛాంపియన్‌గా నిలిచిన జట్టుకు రూ.40 కోట్లు, రన్నరప్ జట్టుకు రూ.20 కోట్లు అందుతాయి. సెమీ ఫైనల్‌లో ఓడిన జట్లకు రూ.10 కోట్ల చొప్పున దక్కుతాయి.

చరిత్ర సృష్టించిన న్యూజీలాండ్ జట్టు

- ఇంగ్లండ్ పై 3–0తో వన్డే సిరీస్ కైవసం

న్యూజీలాండ్ జట్టు చరిత్ర సృష్టించింది. ఇంగ్లండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. కివీస్ గత 42 యేండ్లలో ఇంగ్లండ్‌ను క్లీన్ స్వీప్ చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇంగ్లండ్‌తో శనివారం జరిగిన ఆఖరి వన్డేలో రెండు వికెట్ల తేడాతో గెలవడం ద్వారా న్యూజీలాండ్ ఈ ఘనతనుసాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 40.2 ఓవర్లలో 222 పరుగులు చేసింది. జెమీ ఓవర్టన్ 68, జోస్ బట్లర్ 38, బ్రైడన్ కార్స్ 36 విలువైన పరుగులు చేశారు. న్యూజీలాండ్ బౌలర్లలో బ్లయర్ టిక్‌నర్ నాలుగు వికెట్లు తీయగా, జాకోబ్ డఫ్ఫీ మూడు వికెట్లు పడగొట్టాడు. జాక్ ఫోల్కర్స్ కు రెండు వికెట్లు, మిచెల్ సాంట్నర్ కు ఒక వికెట్ దక్కాయి. అనంతరం బరిలోకి దిగిన న్యూజీలాండ్ జట్టు 44.4 ఓవర్లలో 8 వికెట్లకు 226 పరుగులు చేసి గెలుపొందింది. రచిన్ రవీంద్ర 46, డారిల్ మిచెల్ 44 పరుగులు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో జెమీ ఓవర్టన్, సామ్ కరన్ రెండేసి వికెట్లు తీయగా, బ్రైడన్ కార్స్, ఆదిల్ రషీద్ కు తలో వికెట్ దక్కింది.ఈ సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లను గెలిచిన న్యూజీలాండ్ 3-0తో సిరీస్ కైవసం చేసుకుంది. న్యూజీలాండ్ చివరిసారిగా 1983లో జియోఫ్ హోవర్త్ సారథ్యంలో ఇంగ్లండ్ ను వైట్ వాష్‌చేసింది. మళ్లీ ఇన్నాళ్లకు మిచెల్ సాంట్నర్ సారథ్యంలో ఈ ఘనత సాధించి ప్రపంచ క్రీడాభిమానుల దృష్టిని ఆకర్షించింది.

తుది పోరుకు సిద్ధమైన భారత మహిళల జట్టు

- 50 యేండ్ల కలగా నెరవేర్చుకునే దిశగా అడుగులు

మహిళల వన్డే ప్రపంచకప్ ట్రోఫీకి టీమిండియా అడుగు దూరంలో ఉంది. 50 యేండ్లుగా కలగా మిగిలిన ఐసీసీ టైటిల్‌ను అందుకునేందుకు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత మహిళల జట్టు తమతహలాడుతోంది. ఆదివారం నాడు నవీ ముంబైలో జరిగే ఫైనల్ మ్యాచులో సౌతాఫ్రికాను ఓడించి ఈ ఘనతను పొందాలనే పట్టుదలతో భారత్ ఉంది. ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్ లో అసాధారణ ఆటను కనబర్చిన భారత్, అదే జోరు ఫైనల్ లో కూడా కొనసాగిస్తే మహిళల క్రికెట్ లో సరికొత్త చరిత్ర లిఖిస్తుంది. బలాబలాల పరంగా ఇరు జట్లు సమానంగానే ఉన్నాయి. లీగ్ దశలో భారత్‌పై సౌతాఫ్రికాదే పైచేయి. అప్పుడు అనవసరం తప్పిదాలతో టీమిండియా మూల్యం చెల్లించింది. కానీ, ఫైనల్ జరిగే నవీ ముంబైలోనే టీమిండియా వరుసగా మూడు మ్యాచులు ఆడటం హర్మన్‌సేనకు కలిసి వస్తుందని భావిస్తున్నారు. కాగా, ఫైనల్ బరిలోకి దిగే భారత తుది జట్టులో ఎలాంటి మార్పులు చేసే అవకాశం లేదు. సరిపడా బౌలర్లు, బ్యాటర్లతో జట్టు ఫైనల్ ఆడనుంది. సెమీ ఫైనల్ లో దారుణంగా విఫలమైన రాధా యాదవ్ స్థానంలో స్నేహ్ రాణా తుది జట్టులోకి రావచ్చు. ఈ టోర్నీలో సౌతాఫ్రికా స్పిన్నర్లను ఎదుర్కోలేకపోయింది. సెమీస్ లో లెఫ్టార్మ్ బ్యాటర్ లేకుండా బరిలోకి దిగింది. కాబట్టి భారత్ రాధా యాదవ్‌నే కొనసాగించే అవకాశాలు ఉన్నాయని కొందరు చెబుతున్నారు. ఈ ఒక్క విషయంలో మినహా మిగతా లైనప్‌లో ఎలాంటి మార్పు చేసే అవకాశం లేదు. తుది జట్టు (అంచనా) : స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), అమన్‌జోత్ కౌర్, రాధా యాదవ్/స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్, శ్రీ చరణి, రేణుకాసింగ్.

టెన్నిస్ నుంచి తప్పుకున్న రోహన్ బోపన్న

- ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించిన స్లార్ అథ్లెట్

భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న ఆట నుంచి వైదొలిగాడు. తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా శనివారం నాడు వెల్లడించాడు. సుదీర్ఘ కెరీర్‌లో సహకరించిన వాళ్లందరికీ, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపాడు. ఈ క్రమంలో వెటరన్ క్రీడాకారులు సానియా మీర్జా, పీవీ సింధు బోపన్నకు శుభాకాంక్షలు తెలిపారు. 2002లో ఆటలోకి ప్రవేశించిన బోపన్న దాదాపు రెండు దశాబ్దాలకు పైగా టెన్నిస్ ఆడాడు. నిజానికి 45 యేండ్ల బోపన్న నిరుడే రిటైర్మెంట్ ప్రకటించినా, ఇప్పటిదాకా ప్రొఫెషనల్ గ్రాండ్‌స్లామ్, ఏటీపీ టోర్నీలలో మాత్రం కొనసాగాడు. ఇకపై ఏ టోర్నీలోనూ బరిలో దిగనని ప్రకటించాడు. 'ఇది ముగింపు కాదు. మనకు జీవితాన్నిచ్చిన దానికి వీడ్కోలు ఎలా పలుకుతాం? 20 యేండ్ల సుదీర్ఘ జర్నీ తర్వాత రాకెట్ వదిలేస్తున్నాను. దీంతో నా హృదయం బరువెక్కింది. భారతదేశంలోనికూర్గ్ అనే చిన్న పట్టణంలో మొదలైన నా ప్రయాణం ప్రపంచంలోని అతిపెద్ద టోర్నీల దాకా సాగడం కలగా ఉంది' అని బోపన్న పేర్కొన్నాడు. 'ఓడిపోయినప్పుడు, ప్రపంచం నన్ను అనుమానించినప్పుడు నమ్మకాన్ని ఇచ్చింది నా బలమే. 'నా తల్లిదండ్రులే నా హీరోలు. వారు మద్దతుగా ఉండడం వలననే నేను నా కల నెరవేర్చుకోగలిగాను. నా కోసం వారు చేసిన త్యాగాలు నేను మర్చిపోను. నా సోదరి రష్మీ అన్నింటిలోనూ ప్రోత్సహించింది. నేను సాధించిన ప్రతి విజయం వెనుక నా భార్య సుప్రియ ప్రేమ, ఓర్పు ఉంది. నేను ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ నా కూతురు త్రిధ కోసమే ఆడాను. నువ్వు ప్రాణం' అని బోపన్న తన పోస్టులో భావోద్వేగ వ్యాఖ్యలు చేశాడు.



పెద్ది ఆటకు.. అచ్చియమ్మా కామెంట్రీ

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం శ్రీలంకలో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి కథానాయికగా నటిస్తున్న బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో జాన్వీ అచ్చియమ్మా అనే పాత్రలో కనిపించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఇందులో జాన్వీ క్రికెట్ కామెంటేటర్‌గా కనిపించనుంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2026 మార్చి 27న విడుదల కానుంది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో రామ్ చరణ్‌తో పాటు కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తుండగా, రత్నవేలు సినిమాటోగ్రఫీ, కొల్లా అవినాష్ ఆర్ట్ డైరెక్షన్, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జగపతిబాబు, దివ్యేందు భట్టాచార్య వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వృద్ధి సినిమాస్ సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్, టీసిరీస్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

వణుకు పుట్టించేలా 'శంబాల'

ప్రభాస్ చేతుల మీదుగా ట్రైలర్ విడుదల..

వెర్సటైల్ హీరో ఆది సాయి కుమార్ నటించిన మిస్టికల్ థ్రిల్లర్ 'శంబాల: ఎ మిస్టికల్ వరల్డ్' ప్రస్తుతం అందరిలోనూ బజ్‌ను క్రియేట్ చేస్తూ ట్రెండ్ అవుతోంది. మరింత హైప్‌ను పెంచేలా రెబల్ స్టార్ ప్రభాస్ ఈ చిత్రం ట్రైలర్‌ను ఆవిష్కరించి, బృందానికి తన శుభాకాంక్షలు తెలిపారు. ఈ ట్రైలర్‌ను చూస్తే ఆడియెన్స్‌కి ఓ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించబోతోన్నట్టుగా కనిపిస్తోంది. 'కొన్ని వేల సంవత్సరాల క్రితం పరమశివుడికి, అసురుడికి మధ్య జరిగిన ఓ భీకర యుద్ధం.. ఈ కథకి మూలం' అంటూ సాయి కుమార్ గంభీరమైన వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ ఆరంభమైంది. 'అగ్ని పురాణం ప్రకారం ఆకాశంలో సంగ్రామం జరిగినప్పుడు దుష్ట శక్తులు జంతువుల్ని సైతం ఆవహిస్తాయి'.. 'వాళ్లేమో చీమ కుట్టినా శివుడి ఆజ్ఞ అని నమ్మతారు.. విక్రమ్ ఏమో చావులో సైతం సైన్స్ ఉందనే రకం'.. 'మీరు చెబుతున్న శాస్త్రం మితం.. మీరు తెలుసుకోవాల్సిన మా శాస్త్రం అనంతం' అనే డైలాగ్స్, ట్రైలర్‌లోని విజువల్స్, బీజీఎం, యాక్షన్ సీక్వెన్స్ చూస్తుంటే సరైన పాన్ ఇండియా కంటెంట్‌లా కనిపిస్తోంది. ఆది సాయి కుమార్ యాక్షన్, అప్పియరెన్స్ మరింత పవర్ ఫుల్‌గా కనిపిస్తున్నాయి. యుగంధర్ ముని మేకింగ్, ప్రవీణ్ కె బంగారి విజువల్స్, శ్రీ చరణ్ పాకాల హాంటింగ్ బీజీఎం నెవ్వర్ బిఫోర్ అనేలా ఉన్నాయి. ఇక నిర్మాతలు రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ మూవీని భారీ ఎత్తున నిర్మించారని ట్రైలర్ చూస్తేనే తెలుస్తోంది. ఇక ఈ ట్రైలర్‌లో అర్చన అయ్యర్, స్వశిక, రవివర్మ, మధునందన్, శివ కార్తీక్ పోషించిన ఇతర కీలక పాత్రలను కూడా పరిచయం చేశారు. ఇందులో ప్రతి ఒక్కరి పాత్ర కథనానికి డెప్త్‌ను తీసుకు వచ్చినట్టు అనిపిస్తోంది. విజువల్ వండర్‌గా, అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించేందుకు ఈ చిత్రం క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 25న ఆడియెన్స్ ముందుకు రానుంది. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి ఈ ప్రతిష్టాత్మక మూవీని భారీ ఎత్తున నిర్మించిన సంగతి తెలిసిందే.



'రేజ్ ఆఫ్ కాంత' రిలీజ్

వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ బైలింగ్వల్ పీరియాడికల్ డ్రామా 'కాంత' నవంబర్ 14న రిలీజ్ కానుంది. 1950మద్రాస్, సినిమా గోల్డెన్ ఏజ్ బ్యాక్ డ్రాప్ రూపొందుతున్న ఈ చిత్రానికి సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. కాంత అద్భుతమైన ప్రేమకథతో పాటు మూవీ వరల్డ్ కి ట్రిబ్యూట్. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా.. సముద్రఖని కీలక పాత్రలో నటిస్తున్నారు. చిత్రాన్ని దుల్కర్ సల్మాన్ వేఫేరర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ తో కలిసి సంయుక్తగా నిర్మిస్తున్నారు. టీజర్, సాంగ్స్ తో ఇంపాక్ట్ క్రియేట్ చేసిన తర్వాత, మేకర్స్ ఇప్పుడు రాప్ ఆంథమ్ "రేజ్ ఆఫ్ కాంత" రిలీజ్ చేశారు. ఝాను చాంతర్ స్వరపరిచిన ఈ సాంగ్ అదిరిపోయింది. వింటేజ్ ఎలిమెంట్స్‌ను ఆధునిక రాప్ బీట్స్, పవర్‌ఫుల్ గిటార్ సౌండ్స్‌తో మేళవిస్తూ రూపొందించిన ఈ ట్రాక్ "కాంత" సినిమా నుండి ఎలాంటి ఎనర్జీ, ఇంటెన్సిటీని ఆశించవచ్చో చెప్పేస్తోంది.

'మహాకాళి' పవర్ ఫుల్ ఫస్ట్ లుక్

హనుమాన్ సినిమాతో సూపర్ హీరో జానర్‌ను నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్ళిన విజనరీ ఫిల్మ్ మేకర్ ప్రసాంత్ వర్మ, ఆర్‌కేడీ స్టూడియోస్ తోకలసి మరోసారి ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తున్నారు. వారి కొత్త చిత్రం మహాకాళి నుంచి లీడ్ ఫేస్‌ను పరిచయం చేశారు. తాజాగా విడుదలైన పోస్టర్‌లో భూమి శెట్టి ప్రధాన పాత్రలో కనిపించగా, ఆమె లుక్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. ఈ సినిమా ఇప్పటికే 50%కు పైగా షూట్ పూర్తిచేసుకుంది. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్స్‌పై ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. సాధారణంగా నాన్‌స్టార్ సినిమాలకు ఇంత భారీ బడ్జెట్ వెచ్చించేందుకు ప్రొడ్యూసర్లు వెనుకాడుతారు. కానీ మహాకాళి టీమ్ మాత్రం ఈ సాహసాన్ని చేసి చూపింది. పలువురు ఏ లిస్టు నటీమణులు సూపర్ హీరో పాత్రను పోషించడానికి ఆసక్తిని వ్యక్తం చేసినప్పటికీ, కథ సారాన్ని నిజంగా ప్రతిబింబించగల కొత్త ముఖం కావాలనే నిశ్చయంతో ఆ పాత్రకు సరిపడే డార్క్ స్కిన్ టోన్, వ్యక్తిత్వం, అన్ని రకాలుగా పర్ఫెక్ట్ గా సూట్ అయ్యే భూమి శెట్టిని ఎంపిక చేశారు. మహాకాళి ఇంటెన్స్, డివైన్ ఫస్ట్ ఫస్ట్ లుక్ ఇన్స్టంట్ గా హిట్ అయ్యింది. ఫస్ట్ లుక్‌లో భూమి శెట్టి ఎరుపు, బంగారు వర్ణంలో ఆగ్రహం, కరుణ రెండింటినీ ప్రతిబింబించే దివ్యమైన ఆరాతో మెరిసింది. సాంప్రదాయ ఆభరణాలు, పవిత్ర చిహ్నాలతో అలంకరించబడిన ఆమె చూపు, సృష్టిప్రళయం, విధ్వంసంపున ర్జన్మ శక్తిని సూచిస్తోంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200